సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 26-08-2022 ₹ 15/-


# సేంద్రీయ వ్యవసాయం సమస్యలకు పరిష్కారమా?





ఇస్లామ్‌లో క్రీడా స్ఫూర్తి



వృద్ధ వేదన



పూల పరిమళం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 34 హైదరాబాద్
శుక్రవారం 26 ఆగస్టు 2022 రూ.15-00
27 ముహర్రం 1444 హిజ్రీ

**తొలిగీటు**

దేవుడు రుణగ్రస్తునికి అండగా అతని రుణం తీరే వరకు ఉంటాడు. అయితే ఆ రుణం చెడు పనికోసం తీసుకుని ఉండకూడదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**
**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**
**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**
**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**
గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**
సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**
సేల్స్ మేనేజర్
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**

**కథ**




**గుడ్ గర్ల్ - 16**

## లోపల...

| | | |
|---|---|---|
| పాలకపక్షం | ...... | 04 |
| సేంద్రీయ వ్యవసాయం సమస్యలకు పరిష్కారమా? | ...... | 05 |
| హిందూ–ముస్లిం ఐక్యతతో బ్రిటీష్ ముష్కరులను మట్టికరిపించిన ఖాన్ బహదూర్ ఖాన్ | ...... | 08 |
| చరితార్థులు– డాక్టర్ జైనుల్ ఆబిదీన్ అహ్మద్ | ...... | 11 |
| ఇస్లామ్‌లో క్రీడా స్ఫూర్తి | ...... | 12 |
| జమాఅతె ఇస్లామీ ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ | ...... | 14 |
| ఏడేళ్లుదాటిన పిల్లల పక్కలను వేరు చేయండి | ...... | 15 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| బద్ర్ మైదానం | ...... | 20 |
| రాబోయే జీవితమే అసలైన జీవితం | ...... | 23 |
| వృద్ధ వేదన | ...... | 24 |
| పూల పరిమళం | ...... | 26 |
| అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి! | ...... | 28 |
| ఎందుకీ ఓర్వలేనితనం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| ధర్మసమ్మతమైన సంపద విశ్వాసి పాలిట దైవానుగ్రహం | ...... | 34 |

## మును'గోడు'



ఓ వైపున టీఆరెస్
మరోవైపు బీజేపి
మధ్యలోన కాంగ్రెస్
పెరుగుతోంది బీపి!
మునుగోడు జనంపై
కురుస్తున్న వరాలు
పార్టీల నాయకులకు
తెగుతున్నె నరాలు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## పాలకపక్షం

**ఇండియాటుడే** ఇటీవల ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వే ముఖ్యంగా ఆర్థికవ్యవస్థపై ప్రజల అభిప్రాయాలకు అద్దం పడుతుంది. సాధారణంగా ఒపినియన్ పోల్స్ జరుగుతుంటాయి. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో ముందుగా చెప్పే ప్రయత్నాలవి. కాని ఈ సర్వేలు ప్రజలు ఏ విషయాల గురించి ఆలోచిస్తున్నారో ప్రకటిస్తాయి. ఇండియాటుడే చేసిన సర్వే ప్రకారం ఒకవేళ సాధారణ ఎన్నికలు జులై 15 నుంచి 31 మధ్య తారీఖుల్లో జరిగి ఉంటే ఎన్డీయే కూటమికి దాదాపు 307 స్థానాలు వచ్చి ఉండేవి. గత ఎన్నికల్లో ఎన్డీయేకు 353 వచ్చాయన్నది గుర్తించాలి. ఇప్పుడు సాధారణ ఎన్నికలకు కనీసం 20 నెలల సమయముంది. కాబట్టి ఇప్పుడు సాధారణ ఎన్నికల్లో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయనే అంచనాలకు అర్థం లేదు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే బీహారులో నితీష్ కుమార్ ఎన్డీయేకు బై బై చెప్పక ముందు జరిగిన సర్వే ఇది. అయినప్పటికీ ఈ సర్వేలో కొన్ని ముఖ్యమైన విషయాలున్నాయి. వాటిపై దృష్టి పెట్టడం పాలకపక్షానికి మాత్రమే కాదు, ప్రతిపక్షాలకు కూడా చాలా అవసరం. ఎందుకంటే, పాలకపక్షానికి ఈ సర్వే ఒక ప్రమాదఘంటికను వినిపిస్తోంది. ప్రతిపక్షాలకు ఈ సర్వే కొత్త అవకాశాల ఆశలు కల్పిస్తోంది.

భారతదేశంలో అతిపెద్ద సమస్య ఏదనే ప్రశ్నకు 27 శాతం మంది అధికధరలు అని జవాబు చెప్పారు. 25 శాతం మంది నిరుద్యోగమన్నారు. 7 శాతం మంది పేదరికమన్నారు. ఏది ఏమైనా ఆర్థిక అంశాలే అందరూ ప్రస్తావిస్తున్నారు. ఆర్థికవ్యవస్థ విషయంలో ఆలోచిస్తే అధికధరలు అందరినీ పీడిస్తున్నాయి. ద్రవ్యోల్బణం తగ్గిందని లెక్కలు చెబుతున్నా ధరలు దిగి రావడం లేదు. నిరుద్యోగం విషయంలో 56 శాతం మంది చాలా సీరియస్ సమస్యగా భావిస్తున్నారు.

నిజానికి భారతీయులు ఆశావహ దృక్పథం కలిగి ఉన్నవారు. దశాబ్దాలుగా అనేక సర్వేల్లో ఈ విషయం స్పష్టంగా తెలిసిన విషయం. కాని ఈ సారి మాత్రం అలాంటి ఆశావహ దృక్పథం కనిపించడం లేదు. దాదాపు 34 శాతం మంది భారత ఆర్థిక పరిస్థితి పట్ల నిరాశ వ్యక్తపరిచారు. 31 శాతం మంది పరిస్థితి మెరుగుపడుతుందని ఆశావాహ దృక్పథం వ్యక్తపరిచారు.

సాధారణంగా ఇలాంటి సర్వేల్లో అభిప్రాయాలు వ్యక్తపరిచే వారు దేశం మొత్తం ఆర్థికపరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడడం జరగదు. కేవలం తమ కుటుంబంలో ఆర్థిక పరిస్థితిని మాత్రమే దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతారు. దేశం మొత్తం ఆర్థిక పరిస్థితి గురించి ఎవరు ఎన్ని మాటలైనా చెప్పవచ్చు. భిన్నాభిప్రాయాలు ముందుకు రావచ్చు. కాని స్వంత కుటుంబం ఆర్థిక పరిస్థితి గురించి ప్రతి వ్యక్తికి చాలా బాగా తెలిసి ఉంటుంది. కాబట్టి ఇక్కడ వాదోపవాదాలకు తావులేదు. ఇండియాటుడే గత ఆరేళ్ళుగా ఇలాంటి సర్వేల్లో ఒక ప్రశ్న అడుగుతోంది. నరేంద్ర మోడీ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? అనేది ఆ ప్రశ్న. ప్రత్యేకంగా మోడీ పేరుతో అడుగుతున్న ప్రశ్న కాబట్టి, ఆయన చాలా ప్రజాదరణ ఉన్న నాయకుడు కాబట్టి సహజంగానే చాలా మంది తమ ఆర్థిక పరిస్థితి బాగుపడిందని జవాబు చెప్పాలి. కాని అలా జరగలేదు. 36 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితి దిగజారిందని చెప్పారు. 28 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితి మెరుగయ్యిందన్నారు.

ఇప్పుడు ఆలోచించవలసిన మరో ప్రశ్న ఏమిటంటే, ఆర్థికపరిస్థితి దిగజారడానికి ప్రభుత్వం కారణమని భావిస్తున్నారా? లేదా అన్నది. మోడీ ప్రభుత్వానికి పాజిటివ్ రేటింగ్స్ 48 శాతం లభించాయి. గతంలో కన్నా ఇది తక్కువ. రేటింగ్స్ పడిపోతున్నాయి. మోడీ ప్రభుత్వ వైఫల్యాల గురించి అడిగినప్పుడు అధిక ధరలు, నిరుద్యోగం, ఆర్థిక ప్రగతి గురించి చాలా మంది మాట్లాడారు. కాని గమనించవలసిన విషయమేమిటంటే, ప్రజల మద్దతు ప్రభుత్వానికి తగ్గలేదు. కశ్మీర్, రామమందిరం వంటి సమస్యలే కాదు, ప్రజలు అవినీతి, కోవిడ్ విషయంలో కూడా ప్రభుత్వ చర్యల పట్ల సంతృప్తి కలిగి ఉన్నారు. ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు. కాని ద్రవ్యోల్బణం, నిరుద్యోగాల పరిస్థితి గమనిస్తే ప్రజాభిప్రాయం మారడానికి ఇవి దారితీయవచ్చు.

ఏది ఏమైనా వ్యక్తిగతంగా మోడీ ప్రజాదరణ ఏ మాత్రం తగ్గలేదన్నది స్పష్టం. ప్రజాదరణ విషయంలో ప్రతిపక్ష నేతలెవ్వరు ఆయనకు దరిదాపుల్లో లేరు. మోడీ ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడేవారి సంఖ్య పెరిగినప్పటికీ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వాదించేవారి సంఖ్య పెరిగినప్పటికీ మోడీ విషయంలో ప్రజల మద్దతు తగ్గలేదన్నది స్పష్టం.

బీహారులో మారిన రాజకీయాలు, ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, అధికధరల వంటి అంశాలు ప్రతిపక్షాలకు ఎంత వరకు ఉపయోగపడతాయన్నది భవిష్యత్తులో మాత్రమే తెలుస్తుంది. ✤

అబ్దుల్ వాహెద్

# సేంద్రీయ వ్యవసాయం సమస్యలకు పరిష్కారమా?



**ఆగష్టు 15 స్వాతంత్ర్యదినోత్సవం** ఆనందంగా జరుపుకున్నాము. ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్రమోడీ ఈ సందర్భంగా చేసిన ప్రసంగాన్ని ఒకసారి పరిశీలిద్దాం.

అవినీతి, వారసత్వ రాజకీయాల గురించి మోడీ మాట్లాడారు. నోట్లరద్దుతో అవినీతి అంతమైపోతుందని అన్నారు. కాని అలా జరిగిందా? ఈ ప్రశ్న అడిగే మీడియా ఇప్పుడు కనబడడం లేదు. వారసత్వ రాజకీయాలు లేని పార్టీ ఏదైనా ఉందా? ఈ ప్రశ్న గురించి ఆలోచించేవారు కనబడడం లేదు.

రానున్న పాతిక సంవత్సరాల్లో ఇండియాను ఎలా చూడాలనుకుంటున్నారో ప్రధాని మోడీ తన ప్రసంగంలో చెప్పారు. కాని ఆయన ప్రసంగంలో నిరుద్యోగ సమస్య, ఉద్యోగావకాశాల గురించి ప్రస్తావన లేదు. అలాగే పెరుగుతున్న ధరల గురించి ఆయన మాట్లాడలేదు. ఉత్తర భారతదేశంలో ఈసారి రుతుపవనాలు కరుణించలేదు. రైతులు కష్టాల పాలవుతున్నారు. ఈ విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించలేదు. భారత రూపాయి చిక్కి శల్యమవుతోంది. ఈ ప్రస్తావన కూడా ఆయన ప్రసంగంలో లేదు.

ఇంతకు ముందు స్వతంత్ర దినోత్సవాల సందర్భంగా ప్రధాని మోడీ చాలా వాగ్దానాలు చేశారు. చాలా హామీలు ఇచ్చారు. ఆ హామీలేమయ్యాయో ఈ సారి ప్రసంగంలో ఆయన చెప్పలేదు. అందరికీ కాంక్రీటు నివాసగృహాలు, టాయిలెట్ సౌకర్యాలు కల్పిస్తామని చేసిన వాగ్దానం ఏమయ్యింది? ఏటా రెండు కోట్ల

ఉద్యోగాల హామీ ఏమయ్యింది? రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానం ఏమయ్యింది? నల్లధనాన్ని రూపుమాపేస్తామన్న మాట ఏమయ్యింది?

ఈ సారి ప్రధాని మోడీ తన ప్రసంగంలో రైతు సమస్యల గురించి మాట్లాడకపోయినా, సేంద్రీయ వ్యవసాయం గురించి మాత్రం మాట్లాడారు. సేంద్రీయ వ్యవసాయం మన తక్షణ కర్తవ్యం అన్నారు. రసాయనాల నుంచి వ్యవసాయాన్ని విముక్తం చేయాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం స్వయం సమృద్ధికి మార్గమన్నారు. ఎరువులు అధికంగా వాడడం వల్ల నేలసారం పతనమవుతుంది. సేంద్రీయ వ్యవసాయం ఈ సమస్యను పరిష్కరిస్తుంది. ప్రజారోగ్యానికి ప్రమాదాలు లేని పద్ధతి ఇది. కాని శాస్త్రవేత్తలు సేంద్రీయ వ్యవసాయం విషయంలో అంత భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారన్నది కూడా మనం మరిచిపోరాదు. ఎందుకంటే సేంద్రీయ వ్యవసాయం వల్ల ఫలసాయం తగ్గిపోతుంది. ఆహారభద్రత దెబ్బతింటుంది. రుతుపవనాలపై ఆధారపడిన వ్యవసాయం వల్ల ఇప్పటికే అనేక సమస్యలున్నాయి.

సేంద్రీయ వ్యవసాయం గురించి ప్రధాని కన్నా ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చాలా గొప్పగా చెప్పారు. జులై నెలలో బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ జీరో బడ్జెట్ సేంద్రీయ వ్యవసాయం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమైపోతాయని చెప్పారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ లేదా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం అనే పద్ధతిని విదర్భకు చెందిన సుభాష్ పాలేకర్ అనే సాంఘిక కార్యకర్త ప్రచారంలోకి తీసుకువచ్చాడు. ఆవుపేడ, ఆవుమూత్రం, వేప మొదలైన వాటితో ఎరువులు, క్రిమిసంహారక మందులు తయారు చేయాలని అన్నాడు. రసాయనిక ఎరువులు వాడడాన్ని ఆయన పూర్తిగా వ్యతిరేకిస్తారు. ఇలాంటి పద్ధతుల వల్ల రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని సీతారామన్ గారు కూడా చెప్పారు. కాని ఈ పద్ధతి ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని చెప్పే శాస్త్రీయ అధ్యయనాలేవీ లేవు. నిజానికి రసాయన అనే పదం పట్ల వెగటు, అసహ్యం అనేవి ఇటీవల పెరుగుతున్నాయి. సాంప్రదాయిక, ప్రాచీన పద్ధతుల పట్ల ప్రేమ మరింత పెరుగుతోంది.

నిజానికి గ్రీన్ రివాల్యుషన్ లేదా హరిత విప్లవానికి ముందు కాలంలో చాలా మంది రైతులు ఏదో ఒక పద్ధతిలో ప్రకృతి వ్యవసాయమే చేస్తూ వచ్చారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల గొప్ప ఫలితాలున్నట్లయితే అసలు మనకు హరిత విప్లవం అవసరమే ఉండేది కాదు. సేంద్రీయ వ్యవసాయం వల్ల ఫలసాయం తగ్గిపోతుందనే చాలా మంది శాస్త్రవేత్తలు అభిప్రాయం.

జీరో బడ్జెట్ అని చెప్పినప్పటికీ సేంద్రీయ వ్యవసాయానికి అవసరమైన ఎరువులు తయారు చేసుకోడానికి ఖర్చు తప్పనిసరి. ఈ ఖర్చు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాలకు అయ్యే ఖర్చు కన్నా కనీసం 40 శాతం తక్కువ ఉండవచ్చు. అంతే తప్ప అస్సలు ఖర్చు లేని వ్యవసాయం కానే కాదు. కాని ఈ పద్ధతి వల్ల దాదాపు 30శాతం వరకు దిగుబడి తగ్గిపోతుందని నిపుణుల అభిప్రాయం.

కాని వినియోగదారులు ఆర్గానిక్ అనే లేబుల్ కనిపిస్తే చాలు అధికధర పెట్టి కొనడానికి సిద్ధపడుతున్న పరిస్థితి ప్రస్తుతం ఉంది. కాని ఈ ఆకర్షణ ఎంత కాలం ఉంటుంది. ఉత్పత్తులు పెరిగితే, వినియోగదారుల్లో అసంతృప్తి పెరిగితే మార్కెట్‌లో డిమాండ్ మళ్ళీ తగ్గిపోవచ్చు. ఏది ఏమైనా నిపుణుల అభిప్రాయాలు సేంద్రీయ వ్యవసాయానికి సంబంధించి విభిన్నంగా ఉన్నాయి.

హరిత విప్లవం పుణ్యమా అని భారతదేశంలో రైతులు అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఇప్పుడు భారతదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి అవసరాని కన్నా ఎక్కువ ఉంది. మిగులు ఎక్కువ ఉంది. అరవైలలో హరిత విప్లవం సాధించిన విజయం ఇది. వరి, గోధుమల దిగుబడి దీని వల్ల చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. అరవైలలో ఆహారధాన్యాల ఉత్పత్తి 82 మిలియన్ టన్నులు మాత్రమే. 2014 నాటికి 264 మిలియన్ టన్నులకు పెరిగింది. సాగుభూమి విస్తీర్ణాన్ని పెంచడం, అధిక దిగుబడి


ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ,
ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:

1800 572 3000

ఇచ్చే వంగడాలను ఉపయోగించడం, దానితో పాటు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాలు వాడడం వల్ల సాధించిన విజయాలివి. సైన్సు ద్వారా సాధించిన విజయాలివి.

కాని సైన్సు రెండువైపులా పదునున్న కత్తి వంటిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాలను వాడడం వల్ల నేలలో భారలోహాలు (కేడియం, సీసం, ఆర్సెనిక్ వంటివి) పెరిగాయి. చాలా ప్రాంతాల్లో నేలలో క్షార గుణాలు పెరిగాయి. సాగుకు ఉపయోగపడే ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు అంతరించాయి. నేల సారం పతనమయ్యింది. మరోవైపు పంజాబ్ వంటి హరితవిప్లవ ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో రైతులు పొలాల్లో పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలను తగలబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతోంది.

ఈ సమస్యల పరిష్కారానికి సేంద్రీయ వ్యవసాయం మార్గమని కొందరి అభిప్రాయం. రసాయనాలను వాడడం అనేది ఉండదు కాబట్టి సహజంగానే నేల సారంపై ప్రభావం ఉండదు. అలాగే సేంద్రీయ వ్యవసాయం వల్ల పర్యావరణానికి కూడా నష్టం ఉండదని నిపుణులు అభిప్రాయం. రైతులు కేవలం సేంద్రీయ ఉత్పత్తులు అంటే ఆవుపేడ, ఆవుమూత్రం వంటివి మాత్రమే ఉపయోగిస్తారు.

సేంద్రీయ వ్యవసాయం ఇప్పుడు భారతదేశంలో పెరుగుతోంది. దేశంలోని సాగునేలలో ఇప్పుడు దాదాపు 2.5 శాతం సేంద్రీయ వ్యవసాయపద్ధతుల్లో సాగుబడి అవుతోందని అంచనా.

కాని సేంద్రీయ వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు కూడా ఉన్నాయి. కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శ్రీకుమార్ ది వైర్ వార్తా సంస్థకు చెప్పిన మాటల ప్రకారం, సేంద్రీయ వ్యవసాయం వల్ల వాటిల్లే నష్టాలు ఉన్నాయి.

సేంద్రీయ వ్యవసాయాన్ని పెద్దస్థాయిలో చేపట్టాలంటే పెద్ద స్థాయిలో సేంద్రీయ ఎరువులు ఉత్పత్తి చేయవలసి ఉంటుంది. అంటే పెద్ద సంఖ్యలో ఆవులు అవసరం. కాని గమనించవలసిన విషయమేమిటంటే ఆవులు బర్రెల వంటి పశువుల వల్ల వాతావరణ మార్పులు చోటు చేసుకుంటాయన్నది నిపుణుల అభిప్రాయం. ఎందుకంటే మిథేన్, నైట్రస్ ఆక్సయిడ్ వంటి వాయువులను ఈ పశువులు ఉత్పత్తి చేస్తాయి. ఈ వాయువులు గ్రీన్ హౌస్ వాయువులు. పెద్దస్థాయిలో గ్రీన్ హౌస్ వాయువుల ఉత్పత్తి వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. వాతావరణ మార్పుల వల్ల వర్షాలపై ప్రభావం పడుతుంది. అలాగే వరదల వంటి విపత్తులకు అవకాశం ఉంది.

సేంద్రీయ వ్యవసాయం వల్ల దిగుబడి తగ్గుతుంది కాబట్టి సాగు భూమి విస్తీర్ణం మరింత పెంచవలసి వస్తుంది. పైగా ఆహార ధాన్యాల ధరలు కూడా పెరిగిపోతాయి. ఇప్పుడు కూడా ఆర్గానిక్ ఉత్పత్తుల ధరలు మార్కెటులో ఎలా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కేవలం అధిక సంపాదన ఉన్నవారు మాత్రమే కొనగలిగేవి.

ప్రధాని, ఆర్థిక మంత్రి ఇప్పుడు ఇంతగా సేంద్రీయ వ్యవసాయం గురించి మాట్లాడడానికి కారణం రైతులకు ఇస్తున్న సబ్సిడీలే అని, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తే సబ్సిడీలకు కోత పెట్టడం ఆటోమేటిగ్గా జరిగిపోతుందని కొందరి అభిప్రాయం. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలకు కోతలు పెడుతూ వస్తోంది.

సేంద్రీయ వ్యవసాయం గురించి మాట్లాడుతున్నప్పుడు ఒకసారి శ్రీలంకలో ఏం జరిగిందో గమనించవలసిన అవసరం కూడా ఉంది. శ్రీలంక కూడా హఠాత్తుగా సేంద్రీయ వ్యవసాయాన్ని అమలు చేసింది. ఏడాది క్రితం తీసుకున్న నిర్ణయమిది. అప్పుడు మహేంద రాజపక్స ప్రభుత్వం రసాయనిక ఎరువులు, క్రిమి సంహారకాల దిగుమతులను నిషేధించింది. కేవలం శ్రీలంకలో ఉత్పత్తి చేసిన సేంద్రీయ ఎరువులు సరిపోతాయని భావించారు. కాని ఫలితాలు తిరగబడ్డాయి. దిగుబడి ఒక్కసారిగా దెబ్బతింది. ఉదాహరణకు వరి దిగుబడి 2021-22లో సగానికి తగ్గిపోయింది. ఎరువుగా ఉపయోగించడానికి అవసరమైన సేంద్రీయవ్యర్థాలు శ్రీలంకలో కావలసిన స్థాయిలో ఉత్పత్తి జరగలేదు. శ్రీలంక భారత దేశం నుంచి 55 మిలియన్ డాలర్లు అప్పు తీసుకుని యూరియా కొనాలని భావించింది.

సేంద్రీయ వ్యవసాయానికి శ్రీలంక మాదిరిగా హఠాత్తుగా మరలడం అనేది చాలా సమస్యలకు కారణం కావచ్చు. జాతీయ ఆహారభద్రతను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. క్రమేణా ప్రవేశపెట్టవలసి ఉంటుంది. మరో సమస్య ఏమిటంటే, ఒక పంటను వరుసగా వేయడం వల్ల సేంద్రీయ వ్యవసాయం కూడా నేల సారాన్ని దెబ్బతిస్తుందని అంటున్నారు. కాబట్టి పెద్దస్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడికి సాంప్రదాయిక సేద్యమే మంచిదని, ప్రకృతిసేద్యం వల్ల అనుకున్న ఫలితాలు రావని చాలా మంది నిపుణుల అభిప్రాయం. అయితే సాంప్రదాయిక ఎరువుల సేద్యం వల్ల వాటిల్లే నష్టాలను తగ్గించడానికి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను కలిపి ఎలా ఉపయోగించాలనే అధ్యయనాలు జరగవలసి ఉంది.

ఏది ఏమైనా, ఇలాంటి నిర్ణయాలు హఠాత్తుగా తీసుకునేవి కావు. లోతయిన అధ్యయనం, శాస్త్రీయ పద్ధతుల్లో పరిశోధనల తర్వాత తీసుకోవలసిన నిర్ణయాలివి. ✤

నశీర్ అహమ్మద్



# హిందూ-ముస్లిం ఐక్యతతో బ్రిటీష్ ముష్కరులను మట్టికరిపించిన
# ఖాన్ బహదూర్ ఖాన్

**పరాయి పాలకులకు** వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజల ఐక్యతకు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ప్రబల సాక్ష్యం. సామాన్య పౌరుడి నుండి రాజులు, రాణులు, సంస్థానాధీశులు, తిరుగబడిన సిపాయిలు చూపిన ఐక్యత అపూర్వం. ఈ ఐక్యతను విచ్ఛిన్నం గావించనిదే తమ పాలనకు మనుగడలేదని గ్రహించిన పాలకులు భారతదేశంలోని ప్రధాన సాంఘిక జనశ్రేణులైన హిందూ-ముస్లింలను మతం పేర వేరుచేయటానికి ఎత్తులను, కుయుక్తులను యధేచ్ఛగా సాగించారు. బ్రిటీష్ పాలకులు ఎంత వరకు వెళ్ళారంటే ముస్లింల పాలనకంటే బ్రిటీష్ పాలన కడుమెరుగైనదన్న మానసిక భావన హిందూ జనసముదాయాలలో కలుగజేసేందుకు చరిత్రను వక్రీకరించి రాసేందుకు పూనుకున్నారు. గత పాలకులకు వ్యతిరేకంగా చరిత్రను తిరగ రాయించుకున్నారు. వక్రీకరణకు గురైన చరిత్రకు బహుళ ప్రచారం కల్పించారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఆంగ్ల రచయిత J.S. Grewal తన పుస్తకం (Muslim Rule in India: The Assessment of British Historian (Oxford University Press, 1970) లో రాశాడు.

మాతృభూమిని పరాయి పాలకుల కబంధహస్తాల నుండి విముక్తం చేసేందుకు తిరుగుబాటు శంఖారావం పూరించి, పోరాడి విజయం సాధించి, చరిత్రలో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్న స్వదేశీ పాలకులలో రోహిల్ ఖండ్ నేత ఖాన్ బహదూర్ ఖాన్ ది ప్రత్యేక స్థానం. బ్రిటీష్ పాలకుల పెత్తనం, ఆధిపత్యాన్ని పూర్తిగా రూపుమాపి, తమ గడ్డ మీద ఆంగ్లేయ అధికారుల జాడ లేకుండా చేసిన ఘనత ఆయనకు దక్కుతుంది. ఈ రకమైన పోరుబాటులో అవధ్ రాణి బేగం హజరత్ మహల్ 14 మాసాల పాటు బ్రిటీషర్లను ఎదిరించి నిలువరించగా, యువకుడైన ఫారూకాబాద్ నవాబు తఫజ్జుల్ హుస్సేన్ సరత్ జంగ్ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి ఓ ఏడాదిపాటు పాలించారు. ఆ బాటలో ఖాన్ బహదూర్ ఖాన్ పదకొండు మాసాల పాటు స్వేచ్ఛగా స్వదేశీ పాలన గావించారు.

సమర్థుడైన తిరుగుబాటు నేతగా చరిత్ర సృష్టించిన ఖాన్ తాత హాఫీజ్ రహమత్ ఖాన్. ఖాన్ బహదూర్ ఖాన్ 1781లో జన్మించారు. ప్రథమ స్వాతంత్ర్య జ్వాలలు దేశభక్తులైన స్వదేశీ పాలకులను, ప్రజలను ఉత్తేజితులను చేసి, స్వతంత్ర పాలన అను ఏకైక లక్ష్యంతో అందరినీ ఐక్యంచేస్తున్న సమయంలో 70 సంవత్సరాల వయస్కుడైన ఖాన్ బ్రిటీషర్లు కల్పించిన అధికార పదవిని వదులుకొని రణరంగ ప్రవేశం చేశారు.

రోహిల్ ఖండ్ రాజధాని బరేలిలో 1857 మే 31 తేదీన ఖాన్ బహదూర్ ఖాన్ తిరుగబాటు బావుటాను ఎగురవేశారు. రోహిల్ ఖండ్‌లోని ప్రజానీకమంతా ఏకమై ఖాన్ నాయకత్వంలో స్వతంత్ర పాలనకు ప్రాణప్రతిష్ట చేసి తెల్లదొరలను మట్టికరిపించారు. ఈ సందర్భంగా రోహిల్ ఖండ్ ప్రజలను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది. ఓ రాజరిక వ్యవవస్థకు ప్రతినిధి అయిన ఖాన్ బహదూర్ ఖాన్ ప్రజలను భారతదేశ ప్రజలారా! అని సంబోధించటం విశేషం. భారత

దేశంలోని ప్రధాన సాంఘిక సముదాయాలైన హిందూ-ముస్లిం సోదరులనుద్దేశించి మాట్లాడుతూ, మన పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవం ఉదయించింది. ఇంగ్లీషు వారు మోసాలకు పాల్పడవచ్చు. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులనూ, హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలనూ రెచ్చగొడతారు. ముస్లింలారా ! మీరు పవిత్ర ఖుర్ఆన్‌ను గౌరవిస్తున్నట్టయితే, హిందువుల్లారా! మీరు గోమాతను ఆరాధిస్తున్నట్టయితే, నాలోని స్వల్ప విభేదాలను మరచి ధర్మయుద్ధంలో చేతులు కలపండి. ఒకే పతాకం కింద పోరాడండి. మన హిందూస్థాన్ మీద ఆంగ్లేయుల పెత్తనం సృష్టించిన మరకలను మీ రక్తంతో శుభ్రం చేయండి' అని ఉద్బోధించారు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రతీక అయినటువంటి ఆకుపచ్చ జెండా రోహిల్ ఖండ్‌లో రెపరెపలాడటం చూసి ఆంగ్లేయులు అదిరిపడ్డారు. బ్రిటీషు సైనిక స్థావరాలలోని సైనికులు తిరగబడటంతో ఆంగ్లేయాధికారులు పారిపోయారు. శతఘ్నుదళానికి చెందిన సుబేదార్ భక్త ఖాన్ తిరుగుబాటుకు మార్గదర్శకత్వం చేశారు. మాతృదేశాభిమానులైన రోహిల్లా ప్రజానీకం జాతి, మత విభేదం లేకుండా ఏకగ్రీవంగా ఖాన్ బహదూర్ ఖాన్‌ను తమ పాలకునిగా అంగీకరించారు. ఆ సమయంలో ప్రజా సముదాయం సమక్షాన నిజాయతీపరుడిగా ఖ్యాతిగాంచిన శోభారాం ప్రధానమంత్రిగా, బ్రిటీష్ సైన్యంలోనున్న స్వదేశీ సైనికులచే తిరుగుబాటు చేయించిన భక్త ఖాన్ సేనానిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ త్రయం ఎంతో దూరదృష్టితో, చక్కని అవగాహనతో, అద్వితీయ ధైర్యసాహసాలతో రోహిల్ ఖండ్ ప్రజల హృదయాలను చూరగొన్నారు.

చివరి మొఘల్ పాదుషా బహదూర్ షా జఫర్ ప్రతినిధిగా తనను తాను ప్రకటించుకుని ఖాన్ బహుదూర్ జాతీయభావాలను గౌరవించారు. ఆయన 40,000 మంది పోరాట వీరులైన రాజపుత్ర, పఠాన్ యువకులతో ఏర్పడిన సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

ఖాన్ సాబ్ తిరుగుబాటును ప్రకటించగానే సైనికులు, ప్రజలు ఏకమై, బ్రిటీష్ పాలకుల తాబేదార్లను, అధికారులను, ఉద్యోగులను, రోహిల్లా నుండి వెళ్లగొట్టారు. రోహిల్లా ఖండ్‌లో ఎక్కడా ఆంగ్లేయులకు నిలువనీడ లేకుండా పోయింది. స్వదేశీ పాలన ప్రారంభమైంది.

ఖాన్ బహదూర్ ఖాన్‌ను, నాయకుల నాయకుడిగా (సర్దార్ ఉల్ సదరత్) ప్రజలు ప్రకటించి గౌరవించారు. స్వతంత్ర పాలకునిగా బాధ్యతలు స్వీకరించిన తక్షణమే తనదైన శైలిలో ఖాన్ పరిపాలనను ప్రారంభించారు.

ఆయన ముందుగా హిందూ, ముస్లింల ఐక్యత కోసం పలు చర్యలు చేపట్టారు. ప్రజానీకం మత మనోభావాలను గౌరవిస్తూ ముస్లింల పర్వదినాన హిందూ సోదరుల మనోభావాలను గౌరవిస్తూ, గోవులను ఖుర్బానీ ఇవ్వటాన్ని నిషేధించారు. హిందూ-ముస్లిం ప్రజానీకంలో స్నేహం, సామరస్యం పటిష్టం చేసేందుకు కృషి చేశారు. అందుకు అనుగుణంగా రోహిల్ ఖండ్ ప్రధాన మంత్రిగా ఖాన్ బహదూర్ ఖాన్ చేత నియమితులైన శోభారాం నడుచుకోవటం, తగిన చర్యలు తీసుకోవటంతో ఆయా మత స్థల మధ్యన చక్కని చిక్కని స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని ప్రారంభించింది, తిరుగుబాటుకు చోదకశక్తిగా నిలిచింది ముస్లింలన్న భావనతోనున్న పాలకవర్గాలు, ప్రజానీకంలో మత విభేదాలను సృష్టించి, స్నేహ సంబంధాలను విచ్చినం చేసి, తమ మనుగడకు ఎటువంటి ముప్పులేకుండా చూసుకోవాలనుకున్నాయి. స్వదేశీ పాలకుల తిరుగుబాటును దారుణంగా అణిచి వేసేందుకు కూడా ఈ ఎత్తు ఉపయోగిస్తుందనుకున్నాయి. హిందువులను మభ్యపెట్టి, ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి, డబ్బుతో ప్రజల దేశభక్తిని కొనేందుకు, భారీగా డబ్బు సంచులను తెప్పించాయి. ఈ మేరకు రోహిల్ ఖండ్‌లో డబ్బు సంచుల ద్వారా హిందూ సోదరులకు లంచాలు ఇచ్చి, ఆర్థిక సౌకర్యాల ఆశ చూపించి ఆకట్టుకుని, ప్రజలను మతం పేరిట చీల్చి అనైక్యత సృష్టించేందుకు ఆంగ్లేయాధికారి జేమ్స్ ఔట్రాం (James Outram) విఫలయత్నం చేశాడు. ఆ పాపిష్టి సొమ్ము మా ఐక్యత ముందు దిగదుడుపు అని ప్రజలు తిరస్కరించారు. ఈ పాపిష్టి డబ్బు కోసం మా ఐక్యతను బలిచేసేది లేదని స్పష్టం ప్రకటించారు. తమ ముంగిళ్ళలోకి తరలి వచ్చిన డబ్బు సంచులను రోహిల్ ఖండ్ ప్రజానీకం తిరగొట్టారు. చివరకు కంపెనీ ఖజానా నుండి దిగుమతి చేసిన సొమ్మును తిరిగి ఖజానాకు పంపించాల్సి వచ్చింది. ఈ విషయాన్ని 'T. R Metcalf తన The Aftermath of Revolt ( page 299 ) గ్రంథంలో రాశాడు. మా మతాలు వేరైనా మా మాతృభూమి ఒక్కటే, మా మార్గం ఒక్కటే, మా లక్ష్యం ఒక్కటే అనుకున్న రోహిల్లా ప్రజలు, మతం పేరిట మనుషుల్ని చీల్చి పబ్బం గడుపుకోవాలనుకున్న బ్రిటీష్ పాలకుల ఎత్తులను త్రిప్పికొట్టారు. ,

స్వతంత్ర రాజ్యం స్థాపించుకున్న ఖాన్, ప్రజాబలంతో పలుమార్లు బ్రిటీషర్ల దాడులను తిప్పికొట్టారు. తమ సైనిక బలగాలు తక్కువ కావటం, కంపెనీ బలగాలు భారీ సంఖ్యతో చుట్టుముట్టడం వలన యుద్ధతంత్ర నిపుణుడైన ఖాన్ తన సైనికులకు స్పష్టమైన గెరిల్లా పోరాట పద్ధతులను సూచించారు. 'The Great Mutiny of India 1857 (Page 374) అను గ్రంథంలో ఆంగ్ల రచయిత 'Christopher Hibbert ఈ విషయాన్ని వెల్లడించాడు.

బరేలి రాజధానిగా రోహిల్ స్వతంత్ర్య రాజ్యాన్ని పటిష్టం

చేసుకున్నాక, పరిసర పట్టణాలలో కూడా కంపెనీ పెత్తనాన్ని తుదముట్టడించాలని ఖాన్ బహదూర్ ఖాన్ అభిలషించారు. ఆయన అభిమతానికి అనుగుణంగా ఫిల్ బిత్, షాజహాన్ పూరు, భదాయూ, వరన్ తదితర పట్టణాల నుండి బ్రిటీష్ సైన్యాలను తరిమివేయడానికి ప్రధాన మంత్రి శోభారాం పథకరచన గావించారు. ఆ వ్యూహాన్ని అమలు జరిపేందుకు సేనాపతి భక్తి ఖాన్ కృషి ప్రారంభించారు. అంతేకాదు తిరుగుబాటు విఫలమై ఢిల్లీ పాదుషా బహదూర్ షా జఫర్ అయోమయ దశలో ఉన్న ప్పుడు, ప్రస్తుతం మనం ఒక యుద్ధంలో మాత్రమే ఓడిపోయాం, రేపు మరో యుద్ధంలో విజయం సాధించవచ్చు, మీరు బరేలీకి బయలుదేరండి, అవధ్‌కు వెళ్ళండి అంటూ బక్ ఖాన్ సలహా ఇచ్చారు. ఆ సలహా చెవికెక్కని పాదుషా విధిలేని పరిస్థితులలో ఆంగ్లేయులకు లొంగిపోయారు. చక్రవర్తి జఫర్ లొంగిపోయినా, ఆయన ప్రతినిధిగా పాలన 'చేసిన ఖాన్ బహదూర్ ఖాన్ స్వతంత్ర పాలకునిగా మరికొంతకాలం మనుగడ సాగించాడు.

ఈ విధంగా రోహిల్ ఖండ్ స్వతంత్ర రాజ్యాన్ని ఢిల్లీ చక్రవర్తికి ఆశ్రయం కల్పించగల స్థాయిలో ఖాన్ బహదూర్ ఖాన్ పటిష్టంగా రూపొందించటం బ్రిటీష్ పాలకులకు మింగుడు పడలేదు. ఆ స్వతంత్ర రాజ్యాన్ని అంతం చేసేందుకు ప్రత్యేకంగా బ్రిటీష్ సైనిక ఉన్నతాధికారి సర్ కొలిన్ క్యాంప్ బెల్‌ను రప్పించి, ఆ బాధ్యతలను అప్పగించారు. ఆ ఆదేశాలందుకున్న క్యాంప్ బెల్ తన సహచరుడైన బ్రిగేడియర్ వాల్ పోల్ నాయకత్వంలో భారీ సైన్యాన్ని బరేలీ మీద దాడికి పంపాడు. ఆ దాడిని రోహిల్లా ప్రజలు, సైనికులు వీరోచితంగా తిప్పికొట్టారు. రోహిల్లా సైనికు లను మట్టి కరిపిస్తానంటూ గొప్పలు చెప్పిన ఆ ఆంగ్లేయ అధికారి పరాజయంతో నవ్వులపాలయ్యాడు. అప్పుడు ఇక లాభం లేదని క్యాంఫ్ బెల్ స్వయంగా రంగంలోకి దిగాడు. అపార సైనిక బలగాలతో బయలుదేరి బరేలిని అన్ని వైపుల నుండి చుట్టు ముట్టాడు. సుశిక్షుతులైన ప్రత్యేక సైనిక దళాలు, అపార ఆయుధసామగ్రితో విరుచుకు పడిన కంపెనీ బలగాలతో ఖాన్ చివరి నిమిషం వరకు పోరాడారు. అపరిమిత బ్రిటీష్ బలగాల ముందు పరిమిత బరేలి బలగాలు నిలువలేని పరిస్థితులు ఎదు రయ్యాయి. బ్రిటీష్ సైన్యాలు అన్నివైపుల నుండి చొచ్చుకు వస్తూ రోహిల్లా సైనిక దళాలను నేపాల్ పర్వతసానువుల వైపుగా తరమ సాగాయి. ఆ సమయంలో తప్పించుకుంటే తిరిగి యుద్ధానికి సిద్ధం కావచ్చునని ఖాన్ అనుయాయులు ప్రధానంగా ప్రధాన మంత్రి శోభారాం ఆయనకు సలహా ఇచ్చారు. ఆ సలహా ఖాన్‌కు నచ్చలేదు. ఆయన విజయమో వీర స్వర్గమో తేల్చుకుందామను కున్నారు. చివరకు అనుయాయుల ఒత్తిడి మీద ప్రధాన అను చరులతో, కొద్దిపాటి సైన్యంతో ఖాన్ 1858 మే 5వ తేదిన బరేలీ నుండి నేపాల్ అడవుల్లోకి వెళ్లిపోయారు.

ఈ విధంగా ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో భాగం పంచుకుని స్వతంత్ర రాజ్యాలను స్థాపించి, గత్యంతరం లేని పరిస్థితులలో నేపాల్ పర్వత ప్రాంతాలలోకి ప్రవేశించిన బేగం హజ్రత్ మహల్, షాహజాదా ఫిరోజ్ షా, ఫారూకాబాద్ నవాబు తఫజ్జుల్ హుస్సేన్ ఖాన్, నానా సాహెబ్, అజీముల్లా ఖాన్, తాంతియాతోపే తదితర ప్రముఖ నాయకులు కూడా తమ తమ అనుచరులతో, సేనలతో చేరుకున్నారు. ఈ నేతలంతా తమ శక్తియుక్తులను కూడదీసుకుని మళ్ళీ పోరాటం సాగించాలని ఆశించారు. దురదృష్టవశాత్తు నేపాల్ పాలకుడు జంగ్ బహదూర్ సహకారం వారికి లభించ లేదు. ఆ అడవుల్లో అంతుచిక్కని రీతిలో నేతలకు, సైనికులకు మలేరియా వ్యాధి సోకటంతో భారీ ప్రాణ నష్టం జరిగింది. బ్రతికి బట్టగట్టగలిగినవారు శారీరక శక్తి ఉడిగిపోయి నిస్సహాయు లయ్యారు. ఆ కారణంగా ఆ నాయకుల కలలు కలలుగానే మిగిలి పోయాయి. ఖాన్ బహదూర్ ఖాన్‌కు నేపాల్ పాలకుడు తోడ్పాటు ఇవ్వకపోవటమే కాక, విశ్వాసఘాతుకానికి పాల్పడ్డాడు. ఆ రోహిల్లా నేతను బ్రిటీషర్లకు అప్పగించాడు.

భారతగడ్డ మీద తమకు ఎదురులేదని విర్రవీగుతున్న బ్రిటీష్ సైనిక దళాలను పలుమార్లు మట్టికరిపించిన ఖాన్ బహదూర్ ఖాన్ మీద కసితో రగిలిపోతున్న వలస పాలకులు, విచారణ తంతును జరిపి ఖాన్‌కు, ఆయనతో పాటుగా తిరుగుబాటులో పాల్గొన్న 243 మందికి ఉరిశిక్షను విధించారు. ఆ శిక్షలను బరేలీ లోని బ్రిటీష్ కమిషనర్ పాత కార్యాలయం ఆవరణలో గల పెద్ద మర్రిచెట్టువద్ద నిర్వహించారు. ప్రజలను, రోహిల్ ఖండ్ వీరులను, 1860 మార్చి 20 వ తేదీన ఆ చెట్టు కొమ్మలకు సామూహికంగా ఉరి తీసారు. ( 'A large number of his followers were also executed by hanging" - Who's Who of Indian Martyrs, Vol.3, page 74) చెట్టు కొమ్మలను ఉ రికంబాలుగా ఉపయోగించటంతో, ఉరితీతల తరువాత చాలా కాలం ఆమర వీరుల మృతదేహాలు చెట్టు కొమ్మల నుండి తొలగించలేదు. ఆ యోధుల భౌతికకాయాలు అలాగే ఆ చెట్టు కొమ్మలకు చుట్టుకుపోయి, ఆకులు, కొమ్మలు ఏవీ కన్పించ కుండా పోయాయని ఆంగ్లేయాధికారులు తమ నివేదికలలో పేర్కొన్నారంటే, ఆనాటి వాతావరణం ఎంత భయానకంగా ఉండి ఉంటుందో ఊహించవచ్చు.

ఆ విధంగా ప్రజలను ఐక్యం చేసి, వలస పాలకులను మట్టికరి పించి, రోహిల్ ఖండ్ స్వతంత్రతను 11 మాసాల పాటు పరిరక్షిం చిన ప్రజానాయకుడు ఖాన్ బహదూర్ ఖాన్ చివరి సారిగా తన సహచరులందరితో కలసి మాతృభూమికి సలాం చెబుతూ, 1860 మార్చి 20తేదీన ఈ లోకం నుండి నిష్క్రమించారు. ✤

'చరితార్థులు'



# డాక్టర్ జైనుల్ ఆబిదీన్ అహ్మద్

## (1907-1999)

139

**పరపాలకుల** పీడన నుండి మాతృదేశాన్ని విముక్తం చేయడమే కాకుండా శ్రమ జీవులను దోపిడి నుండి విముక్తం లక్ష్యంతో జాతీయోద్యమానికి, ఇటు కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన డాక్టర్ జైనుల్ ఆబిదీన్ అహ్మద్ 1907 సెప్టెంబర్ 29న ప్రస్తుత పాకిస్థాన్‌లోని సింధ్ ప్రాంతంలోని ఒమర్‌కోట్‌లో జన్మించారు. ఆయన తండ్రి పేరు జియావుద్దీన్ అహ్మద్ ఆంగ్ల ప్రభుత్వంలో ఉన్నతాధికారి. ఆయన తల్లి ఇక్బాల్ బేగం. ఆయన చిన్నతనంలో తల్లిని పోగొట్టుకున్నారు. ఉన్నత పాఠశాల తరువాత 1923లో కళాశాల విద్యకోసం ఆయన అలీఘర్ వెళ్ళారు. అక్కడ బి.ఎ ఆనర్స్ చేసి 1928లో ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్ వెళ్ళారు. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' నుండి ఆయన 1935లో డాక్టరేట్ పట్టాను పొందారు. 1936లో ఇండియా వచ్చి అటు జాతీయోద్యమం పట్ల ఇటు కమ్యూనిజం పట్ల ఆకర్షితులయ్యారు. బ్రిటిష్ ప్రభుత్వం డాక్టర్ అహ్మద్‌ను ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆహ్వానించినా జాతీయ భావాలతో ప్రభావితుడైన ఆయన బ్రిటిష్ ప్రభుత్వ ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఆయన మనస్సు వలస పాలకులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో పాలు పంచుకోవాలని, అనంతరం అసమానతలు, అంతరాలు లేని భవ్య భారతదేశ నిర్మాణం కోసం కృషి సాగించాలని నిర్ణయించుకుంది. ఆయనకు ఇంగ్లాండ్‌లో పరిచయమైన హాజరా బేగంను 1936లో వివాహం చేసుకున్నారు. జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన ఆయన 1938లో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, ఆర్థిక వ్యవహారాల సలహాదారునిగా నియమితులయ్యారు. డాక్టర్ అహ్మద్ బహిరంగంగా వ్యక్తం చేస్తున్న కమ్యూనిస్టు భావజాలం పట్ల విముఖత గల భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు కొందరు ఆయన్ను కాంగ్రెస్ కమిటీ నుండి తొలగించమని ఒత్తిడి తెచ్చినా జవహర్‌లాల్ నెహ్రూ అందుకు తిరస్కరించారు. జాతీయోద్యమం ఊపందుకుని ప్రజలు ఉద్యమిస్తున్న తరుణంలో డాక్టర్ అహ్మద్ దంపతులు అద్భుతమైన కార్యదక్షత చూపుతూ ముందుకు సాగారు. ఆ కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను పలుమార్లు జైలుకు పంపింది, అనేక ఆంక్షలను విధించింది. 1943లో భారత జాతీయ కాంగ్రెస్ కంటే భారత కమ్యూనిస్టు పార్టీ పట్ల మొగ్గు చూపిన డాక్టర్ అహ్మద్ భార్య హాజరా బేగంతో కలసి కాంగ్రెస్‌కు దూరమయ్యారు. ఆనాడు కమ్యూనిస్టుపార్టీ మీద నిషేధం ఉన్నా, అంతులేని ఆంక్షలున్నా డాక్టర్ అహ్మద్ దంపతులు కష్టనష్టాలకు సిద్ధమయ్యారు. స్వతంత్ర భారత దేశంలో ఆయన 1958లో ఒకసారి 1996లో మరోసారి రాజ్యసభ సభ్యులుగా ఎంపికయ్యారు. ఆ తరువాత లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికయ్యి 1999 వరకు ప్రజల ప్రతినిధిగా డాక్టర్ అహ్మద్ కొనసాగారు. భారతీయ రైతుల సమస్యల పట్ల మంచి అవగాహన గల ఆయన రైతు ఉద్యమాలలో చురుగ్గా పాల్గొంటూ అఖిల భారత కిసాన్ సభకు అధ్యక్షులుగా చిరకాలం బాధ్యతలు నిర్వహించారు. ఆర్థిక-సాంఘిక అసమానతలు లేని సమ సమాజాన్ని ఆకాంక్షించిన డాక్టర్ జైనుల్ ఆబిదీన్ అహ్మద్ ఆ దిశగా కృషి సాగిస్తూ 1999 జనవరి 17న కన్నుమూశారు. ✤




✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ



# ఇస్లామ్‌లో క్రీడా స్ఫూర్తి

**ఇస్లాం** మానవాళికి చేసే స్వచ్ఛమైన బోధనలలో, ఒకవైపు విశ్వాసాలు, ఆరాధనలు, సామాజిక వ్యవహారాలు, నైతిక నియమావళి, సంస్కారం, గౌరవ మర్యాదలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు. నైతిక పరిమితుల్లో ఉంటూనే వినోదం, ఉల్లాసం, ఆటలు, పోటీలు, వివిధ రకాల కళలు కూడా అనుమతించబడ్డాయి. సమాజ శ్రేయానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయోగపడే క్రీడలు ప్రోత్సహించబడ్డాయి. బద్ధకం, సోమరితనం ఇస్లామ్ స్ఫూర్తికి విరుద్ధం. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా చెబుతున్నాడు: కపటులు ప్రార్థన కోసం నిలబడినప్పుడు, వారు సోమరితనంతో నిలబడతారు. (సూరా అన్ నిసా: 142) బద్ధకం, అతి నిద్ర, సోమరితనం, ఏ పని పాటా లేకుండా ఉండటం చాలా అవాంఛనీయమైనది, దైవప్రవక్త (స) వీటినుండి అల్లాహ్ శరణు వేడుకున్నారు.

ఇస్లాంలో వ్యాయామం మరియు క్రీడలు ప్రోత్సహించబడ్డాయి. అలాగే శారీరక బలాన్ని సాధించడం ముఖ్యం అంటుంది ఇస్లాం. అల్లాహ్ ఇలా చెబుతున్నాడు: పోరాడేందుకు కట్టివేసి (సిద్ధంగా ఉంచి)న గుర్రాలతో సహా వీలైనంత ఎక్కువ శక్తి సమకూర్చుకొని సర్వసన్నద్ధంగా ఉండండి.. *(సూరహ్ అల్-అన్ఫాల్: 60)*

“అల్లాహ్ మీకు బదులు అతడ్నే (ఈ పని కోసం) ఎంచుకున్నాడు. ఆయన అతనికి (కార్యసాధనకు కావలసిన) బుద్ధిబలాన్ని, కండ బలాన్ని కూడా పుష్కలంగా ప్రసాదించాడు.

*(సూరా బఖరా: 247)*

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దృఢమైన, ఆరోగ్యవంతమైన విశ్వాసిని ప్రశంసించారు. ఇలా అన్నారు: బలహీనమైన విశ్వాసి కంటే బలమైన, దృఢమైన విశ్వాసి ఉత్తముడు. అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవాడు. *(సహీహ్ ముస్లిం)*

“బలం” అనేది శారీరక బలంతో పాటు ధైర్యం, ఆత్మ స్థయిర్యాన్ని సూచిస్తుంది, తద్వారా ఒక దాసుడు ఆరాధన మరియు ఇతర ధార్మిక, ప్రాపంచిక, సాంఘిక కార్యాలను, కర్తవ్యాలను సులభంగా నిర్వర్తించగలడు.

వ్యాయామం మరియు క్రీడలు మనిషి ఆరోగ్యానికి చాలా ముఖ్యం. అయితే ఇస్లామీయ ఆచారాలకు విఘాతం కల్గించే క్రీడలకు దూరంగా ఉండాలి. ఇస్లామీయ విలువలను దిగజార్చే వినోదాన్ని, ఆటలను, కళలను విడనాడాలి.

ఇస్లామిక్ ఆరాధనల ముఖ్య ఉద్దేశ్యం అల్లాహ్ ఆదేశ పాలన, అల్లాహ్ ప్రసన్నతే. ఈ ఆరాధన పద్ధతుల ద్వారా ప్రధానంగా ఎక్కడైతే ఆధ్యాత్మిక అభివృద్ధి సొంతమవుతుందో, అక్కడే పాక్షికంగా ఈ అద్వితీయ భంగిమల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం కూడా సమకూరుతుంది అందులో ఎలాంటి సందేహం లేదు.

వుజూ (శుచీ శుభ్రతలు) ద్వారా శారీరక ఆరోగ్యం ప్రాప్తిస్తే, నమాజులోని భంగిమలు, విధానం ద్వారా ఆత్మశాంతి సాధ్య మవుతుంది. శారీరక, ఆత్మ పరమైన వ్యాయామంలో ఉపవాసం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అదే విధంగా, హజ్ కూడా ఓ గొప్ప శారీరక, ఆత్మ పరమైన వ్యాయామం. అల్లాహ్ ఇంటి ప్రదక్షిణ, సఫా మర్వా యొక్క సయీ , అరఫా మైదానంలో విడిది, అరఫా నుండి ముజ్దలిఫాకు, ముజ్దలిఫా నుండి మినాకు.. వెళ్లడం అనేది ఇటు శరీరానికి, అటు ఆత్మకి బలాన్ని ఇచ్చే ఆరాధన విధానాలే. వీటి మూలంగా మనిషి శారీరక, ఆత్మ పరమైన శక్తి, సంతృప్తి లభించడమే కాక, ఈ క్రియలన్నీ అల్లాహ్ ప్రసన్నతకు, ఆయన సాన్నిహిత్యానికి తోడ్పడే అద్భుత సాధనాలు.

## గుర్రపు స్వారీ

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వతహాగా ఆరోగ్యవంతమైన దేహం కలిగి, స్వయంగా తన సహచరులను వివిధ క్రీడా కార్యక్రమాలలో పాల్గొనమని ప్రోత్సహించేవారు. ఆయన (స) స్వతహాగా ఒంటె సవారీ చేసేవారు, జీను లేకుండానే గుర్రపు స్వారీ కూడా చేసేవారు. గుర్రాల పోటీని నిర్వహించి విజేతకు బహుమతిని ప్రదానం చేశారు.

## విలు విద్య

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: “బాణాలు సంధించండి, నేను మీతో ఉన్నాను.” (బుఖారీ)
ఇంకో సందర్భంలో “వినండి! విలువిద్య బలానికి సంకేతం…” అని మూడు సార్లు నొక్కి వక్కాణించారు. (ముస్లిం)

## ఈత

మక్కా, మదీనా పరిసరాలలో సముద్రం, నదులు లేనప్పటికీ, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులను ఈత నేర్చుకోమని ప్రోత్సహించేవారు. శరీరానికి వ్యాయామం చేయ డానికి ఈత చాలా ప్రయోజనకరమైన క్రీడలలో ఒకటి. ఈత శరీరంలోని అన్ని భాగాలను బలపరుస్తుంది. ప్రవక్త (స) ఇలా అన్నారు: అల్లాహ్ స్మరణ నుండి విస్మరణకు గురి చేసే ప్రతి క్రీడ, కళ, ఆట అవాంఛనీయ వ్యాపకమే. నాలుగు విషయాలు తప్ప: (1) ఒక వ్యక్తి తన భార్యతో గిల్లికజ్జాలాడటం. (2) తన గుర్రాన్ని తీర్చిదిద్దడం, తర్ఫీదు ఇవ్వడం (3) రెండు గుర్తుల నడుమ (సఫా మరియు మర్వాల మధ్య కొంత దూరం) కాలి నడకన పరిగెత్తడం (4) మరియు ఈత నేర్చుకోవడం నేర్పిం చడం.

## ఈటె విసరడం

విలువిద్య మరియు ఈటె–విసరడం సిఫారసు చేయబడిన క్రీడలు. హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) ఇలా అన్నారు: అల్లాహ్ సాక్షి, ప్రవక్త (స) నా గది తలుపు వద్ద నిలబడి ఉండడం నేను చూశాను. కొంతమంది నీగ్రో వ్యక్తులు మస్జిదు వెలుపల ఉన్న ప్రాంగణంలో ఈటెలతో విన్యాసాలు చేస్తున్నారు. ప్రవక్త (స) తన అంగీతో నన్ను కప్పగా, నేను ఆయన చెవులు మరియు భుజాల మధ్య నుండి కళా ప్రదర్శన చేస్తున్న అబిసీనియన్లను చూసే దానిని. *(సహీహ్ బుఖారీ)*

## కాలి నడక

దైవ ప్రవక్త(స) కూడా వ్యాయామంగా కాలి నడక సాగించే వారు.. హజ్రత్ అబూ హురైరా (ర) అంటున్న మాట – నేను ఆయనంత వేగంగా నడిచే వ్యక్తిని మరొకరిని చూడ లేదు. ఆయన అలా వడివడిగా నడిచి వెళుతుంటే ఇంత సువిశాలమైన భూమి ఆయన కోసం చుట్టివేయబడిందా? అనిపించేది. మేము ప్రవక్త (స)తో కలిసి నడిచినప్పుడు, మేము చాలా కష్టపడవలసి వచ్చేది, మేము అలసి పోయేవారం కానీ, ఆ అలసట ప్రభావం ప్రవక్త (స)పై కనిపించేది కాదు, ప్రవక్త (స) మక్కా నుండి తాయిఫ్ వరకు దాదాపు 110 కిలోమీటర్లు దూరం కాలినడకన వెళ్లారు.

## రన్నింగ్ రేస్

ప్రవక్త (స) సహచరులు సాధారణంగా పరిగెత్తేవారు, వారి మధ్య ఆరోగ్యవంతమైన పోటీ కూడా ఉండేది. బిలాల్ బిన్ సఅద్ (ర) ఇలా అన్నారు, ప్రవక్త (స) యొక్క సహచరులు చిహ్నాల మధ్య పరుగెత్తడం నేను చూశాను, వారిలో కొందరు నవ్వుతూ ఉన్నారు, అవును! రాత్రి కాగానే ప్రార్థనల్లో నిమగ్నమై ఉండేవారు. *(మిష్కాత్)*

## మల్ల యుద్ధం

ప్రఖ్యాత అరబ్ మల్లయోధుడు రుకానా, దైవ ప్రవక్తతో కుస్తీ పోటీలో తలపడ్డాడు. దైవప్రవక్త (స) అతనిని మల్ల యుద్ధంలో మట్టి కరిపించారు. *(అబూ దావూద్)* ✤




# జమాఅతె ఇస్లామీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సంఘసేవపై రెండు రోజుల వర్క్ షాప్

**జమాఅతె ఇస్లామీ హింద్** కేంద్ర సంఘసేవ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆగస్టు 13, 14న రెండు రోజుల జాతీయ స్థాయి **'వర్క్ షాప్'** నిర్వహించారు. దేశ వ్యాప్తంగా సంఘసేవ విభాగాల రాష్ట్ర కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, ప్రత్యేక బాధ్యులు హాజరైనారు. తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ హామీద్ ముహమ్మద్ ఖాన్ ఖుర్‌ఆన్ ప్రబోధనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఖుర్‌ఆన్‌లో సంఘసేవ అంశాలు ఉటంకించారు. ప్రవక్త సంఘసేవలో ప్రజలతో మమేకమైన తీరు ఇస్లాం వాస్తవ పరిచయానికి నాంది అయిందని సోదాహరించారు. జనాబ్ అబ్దుల్ జబ్బార్ సిద్దీఖీ, మర్కజ్ ఖిద్మత్ సెక్రటరీ రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షిస్తూ ధార్మిక పరిధిలో సంఘ సేవ ఔన్నత్యాన్ని వివరిస్తు సంఘ సేవ చేసేవారిలో దైవ ప్రసన్నత అంతర్గతంగా ఇమిడి ఉండాలని, సాటి మనిషిని ఆదుకున్న తృప్తి ఉన్నపుడే సంఘసేవ సార్థకత అవుతుంది అన్నారు. ఖిద్మత్-ఎ-ఖల్ఖ్ కోఆర్డినేటర్ జనాబ్ షోయబ్ ఇస్లాం వర్క్‌షాప్ ఆవశ్యకత వివరిస్తూ, సామాజిక సేవా క్షేత్రంలో క్యాడర్ సేవలు ఉన్నత ప్రమాణాలతో ఎలా సద్వినియోగం చేయాలన్నది ముఖ్యాంశం అన్నారు. జమాఅత్ కేంద్ర కార్యదర్శి జనాబ్ సయ్యద్ మొహియుద్దీన్ షాకీర్, జమాత్ పబ్లిక్ రిలేషన్స్ సహాయ కార్యదర్శి జనాబ్ నదీమ్, డా. ఫహీముద్దీన్ అహ్మద్ దావత్ వారపత్రిక ప్రధాన సంపాద కులు, ఎస్.క్యూ. మసూద్, కోఆర్డినేటర్, హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్, తెలంగాణ చార్టెడ్ అకౌంటెంట్ ముహమ్మద్ ఇర్షాద్, సిడబ్లూఎస్ హైదరాబాద్ మాజి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జ్ఞాన ప్రకాశం, ఎపిసిఆర్ తెలంగాణ కోఆర్డినేటర్ ముహమ్మద్ అఫ్జల్, జనాబ్ అలీ అస్గర్ ASEEM అధ్యక్షులు లాంటి ప్రముఖ సామాజిక సేవా నిపుణులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ద్వారా వివిధ అంశాలు విశదపర్చారు. ప్రముఖులు అందించిన సమాచారం, డేటా, సాంకేతిక పరిజ్ఞానం, సేవలో ఉత్పన్న మయ్యే సమస్యలు, అదిగమించే తీరు తెన్నులు వర్క్ షాప్ అటెం డెంట్స్‌కు దిశా నిర్దేశం ఇవ్వగల్గాయి. బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, గుజరాత్, ప.బెంగాల్, ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, కర్నాటక, తమిళనాడు, డిల్లీ, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుండి హాజరయిన రాష్ట్ర సంఘసేవ విభాగాల కార్యదర్శులు తమతమ రాష్ట్రాలలో చేసే వైద్యం, విద్యా, ఉపాధి రంగాల్లో కులమతాలకు అతీతంగా చేసే సేవా కార్య క్రమాల నివేదికలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. పలు రాష్ట్రాల నివేదికలు పరస్పరం స్ఫూర్తిదాయకంగా, అభినంద నీయంగా నిలిచాయి. వివిధ స్థాయిలో సంఘసేవ విభాగం ద్వారా జమాఅతె ఇస్లామీ హింద్ అందించే సేవలు జాతి విపత్తులపుడు, కరోనా సమయంలో ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నాయి. రాష్ట్ర నివేదికల పట్ల సంఘసేవ విభాగం జాతీయ కార్యదర్శి జనాబ్ అబ్దుల్ జబ్బార్ సిద్దీఖీ గారు సంతృప్తి వ్యక్తం పరుస్తు పలు చోట్ల చాతుర్వర్ష ప్రణాళికను అధిగమించాయన్నారు. శిక్షణలో భాగంగా వడ్డీ రహిత ఖిద్మత్ సొసైటీ బ్యాంకులను హాజరైన వివిధ రాష్ట్రాల కార్యదర్శులు సందర్శించారు. వర్క్ షాప్ పరస్పరం పరిచయాలు, అభిప్రాయల సేకరణకు ఉ పయుక్తమైంది. తెలంగాణ జమాత్ రాష్ట్ర కార్యాలయంలోని ఆడిటోరియంలో నిర్వహిం చిన వర్క్ షాప్‌లో తెలంగాణ రాష్ట్ర జేఐహెచ్ సంఘసేవ కార్యదర్శి జనాబ్ అహ్మద్ అబ్దుల్ హలీం కన్వీనర్‌గా వ్యవహరించి అందరికి సేవలు అందించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ హామీద్ ముహమ్మద్ ఖాన్ గారి దుఆతో సమావేశం ముగిసింది.

**రిపోర్టింగ్: షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**

# ఏడేళ్లు దాటిన పిల్లల పక్కలను వేరు చేయండి



తమ పిల్లల్ని సభ్యతా సంస్కార వంతులుగా తీర్చిదిద్దాలని కోరుకునే తల్లిదండ్రులు, సౌశీల్యవంతులుగా చూడాలనుకునే పేరెంట్స్ కోసం...

✤ మీ చిన్నారుల్ని ఒంటరిగా ఉండనివ్వకండి. కంప్యూటర్, ఖరీదైన మొబైల్ కొనిచ్చి వారి మానాన వారిని వదిలేయడం చాలా ప్రమాదకరం. పిల్లలు ఎక్కువసేపు ఏకాంతంలో గడపడం వల్ల చెడు తలంపులు పురుడు పోసుకుంటాయి. ఒంటరిగా ఉండేవారిని షైతాన్ సులువుగా ప్రేరేపిస్తాడు.

✤ మీ పిల్లలు ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారో, ఆ స్నేహితులను గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండండి. వాళ్ల అలవాట్లు ఎలా ఉన్నాయో స్వయంగా తెలుసుకోండి.

✤ మీ పిల్లల్ని ఎప్పుడూ ఖాళీగా ఉంచకండి. ఖాళీగా ఉండే మెదడు షైతాన్‌కు పుట్టిల్లు అని అంటారు. పసి మెదడు తెల్లని కాగితంలా ఉంటుంది. మంచినైనా, చెడునైనా చాలా త్వరగా స్వీకరిస్తారు.

✤ వాళ్ల ఆసక్తి, అభిరుచులను తెలుసుకుని మంచి అలవాట్లను నేర్పండి. అందులో వారిని ప్రోత్సహించండి.

✤ పిల్లలు కాలయాపన చేయడానికి టివీలకు అతుక్కుపోతారు. దీనివల్ల పిల్లల ఆలోచనలు కలుషితమవుతాయి. మొబైల్ గేమ్స్, కార్టూన్లు పిల్లల్లో హింసాత్మక ధోరణిని ప్రేరేపిస్తాయి.

✤ శారీరక దృఢత్వం కలిగించే ఆటల్లో నిమగ్నం చేయండి. దీనివల్ల శారీరకంగా అలసిపోయి రాత్రి మంచి నిద్రను ఆస్వాదిస్తారు.

✤ తల్లిదండ్రులుగా కర్తవ్యాన్ని నిర్వర్తించడం బృహత్తర బాధ్యత. ఈ బాధ్య తను గొప్ప వరంగా భావించండి.

✤ సంతానాన్ని మరీ ఎక్కువగా గారాబం చేయకండి. సుశిక్షణతో పెంచండి. మాట్లాడే వయస్సుకు చేరుకునే టప్పుడు లాయిలాహ ఇల్లల్లాహ్ కలిమా నేర్పించండి. ఏడేళ్ల వయస్సుకు రాగానే నమాజు తర్ఫీదు నివ్వండి.

✤ పిల్లలు పరిశుభ్రతను పాటించేలా చూడండి. నిత్యం వారిని పరిశుభ్ర వాతావరణంలో ఉంచండి.

✤ ఆడ పిల్లల్ని చిన్నప్పటి నుంచే అపరిచితుల విషయంలో జాగ్రత్త వహించేలా చూడండి. ఇస్లామ్ ధార్మికత ఉట్టిపడేలా పిల్లల డ్రెస్ కోడ్ ఉండేలా చూడండి.

✤ ఏడేళ్లు దాటిన పిల్లల పక్కలను వేరు చేయండి.

✤ వారానికోసారి పిల్లల స్కూలు బ్యాగును చెక్ చేయండి.

✤ ఇంట్లో పేరెంట్స్ ఇద్దరూ మాట్లాడుకునేటప్పుడు పరుషంగా, దుర్భాషలకు తావుండకూడదు. వారి ముందు హుందాగా వ్యవహరించాలి. పిల్లలు తల్లిదండ్రుల ప్రతీ విషయాన్ని, ప్రతీ మాటనూ గమనిస్తుంటారు.

✤ పిల్లలు టీనేజీ వయస్సుకు చేరుకోగానే ఖుర్‌ఆన్‌లోని సూరె యూసుఫ్, సూరె నూర్ అధ్యాయాలను వివరించండి. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) తమ శీలాన్ని ఎలా కాపాడుకున్నారో, ఆ తరువాత ఆయనకు అల్లాహ్ ఎంతటి గౌరవమర్యాదలు ప్రసాదించాడో విడమర్చి చెప్పండి.

✤ మీ పిల్లలు సౌశీల్యానికి, పరిశుద్ధతకు, సభ్యత సంస్కారాలకు నిలువెత్తు నిదర్శనంగా మారాలని అల్లాహ్‌ను వేడుకోండి. ✤

## కథ

# గుడ్ గర్ల్

షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల



**జరీనా** మధ్యాహ్నం కోసం భర్తకు, పిల్లలకు అన్నం కూరలు టిఫిన్‌లో కట్టి పంపింది. తాను తిని పని మనిషి కోసం టీస్పూన్ తీసి , యాంత్రికంగా అంత సర్దింది. కాని ఉదయం కూతురు ఇర్ఫానా పుస్తకాలు సర్దుతుంటే కనిపించిన కాగితం ఆందోళన కలిగిస్తోంది. పని చేస్తూనే ఇర్ఫానా ముఖం వైపు మాటి మాటికీ చూసినా ఎలాంటి మార్పు లేదు, అదే అమాయకమైన ముఖం, చెదరని దరహాసం. తన కూతురు అలాగే ఉండాలని, తన సంసారం చల్లగా సాగాలని ప్రతి నమాజులో ప్రార్థిస్తుంది జరీనా.

ఇర్ఫానా పుస్తకంలో దొరికిన కాగితం మళ్ళీ జాగ్రత్తగా చదివింది జరీనా. అదో ప్రేమ లేఖ. ఇర్ఫానా ఇంటర్ చదువుతోంది. మంచి క్రమశిక్షణ గల అమ్మాయి. ఇంట్లోను తాము చాలా క్రమశిక్షణతో పెంచుతున్నాం. మరి ఎక్కడ తప్పు జరిగింది? ఇర్ఫానా వయసు ఇంకా పదిహేనేళ్ళే, మరి అప్పుడే ప్రేమలా? వయసు ప్రభావమా తల్లిగా తన ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి. తాము ఇంకా సెల్ ఫోన్ కూడా కొనివ్వలేదు. కూతురు కూడా అడుగలేదు. ఇంట్లోని కామన్ సెల్ అందరు వాడుతారు. అప్పుడప్పుడు తమ్ముడితో కలిసి సెల్ ఫోన్‌లో ధార్మిక క్విజ్‌లు, గేమ్స్ ఆడుతుంది. ఆ లవ్ లెటర్ సహజంగానే జరినాలో ఆందోళనకు గురి చేస్తుంది.

సాయంత్రం భర్త ఫరీద్ ఆఫీసు నుంచి వస్తూ తెచ్చిన కూరగాయలు అన్నీ ఫ్రిజ్‌లో సర్ది, ఫ్రూట్స్ డైనింగ్ టేబుల్‌పై బుట్టలో ఉంచింది. పండ్లు ఎవరికి తోచినపుడు వాళ్ళు తీసుకుని తింటుంటారు. భర్త ఫ్రెషప్ అయి టీ తాగి మగ్రిబ్ నమాజ్‌కు వెళతాడు. పిల్లలు వచ్చి ఏదన్నా స్నాక్స్ తీసుకుని హోమ్ వర్క్ చేసుకుంటారు. తమ తల్లిదండ్రులది, భర్త తల్లి దండ్రులది సాంప్రదాయకమైన కుటుంబాలె! భార్యభర్తలు పిల్లల కోసం ఆదర్శ జీవితం గడుపుతున్నారు. మరి ఇర్ఫానా పుస్తకంలో ఆ లెటర్ ఏంటి? తను చూసింది, భర్త చూసుంటే? అమ్మో.. ఈ విషయం భర్తకు చెప్పాలా వద్దా అన్న సందిగ్ధంలో జరీనాకు ఏమి తోచడం లేదు. అలాగే యాంత్రికంగా పిల్లలకు స్నాక్స్ చేసి, టీ తయారు చేసి ఫ్లాస్క్‌లో ఉంచింది. ముందు ఇర్ఫానా, తరువాత కుమారుడు జహీర్ వచ్చారు. ఇర్ఫానాలో ఎలాంటి మార్పు లేదు, కాలేజి నుంచి వస్తూనే అమ్మీ! అంటు వచ్చి చుట్టుకుంది. రేపు కాలేజీకి వెళ్ళనమ్మా అంటు షాక్ ఇవ్వబోయింది. ఏం లేదులే అమ్మా రేపు 'బంద్' ఉంది అని అందరికి సెలవు ప్రకటించారు అంటూ అక్క జోక్‌ను కొట్టి వేసాడు తమ్ముడు. ఒరేయ్.. అంటు తమ్ముడి వెంట పడింది. వాడు చుట్టి వచ్చి అమ్మ ఒడిలో వాలిపోయాడు. పదండి, పదండి ఫ్రెష్ అవ్వండి అంటూ పురమాయించి ఉంది జరీనా. లేడి టీచర్ వచ్చి పిల్లలకు ఉర్దూ అరబీ నేర్పిస్తుంది.

అంతా భోజనం చేసి తండ్రితో ఎడ్యుకేషన్ విషయాలు మాట్లాడుతూ ప్రక్కన హాల్‌లో ఎవరి మంచంపై వాళ్ళు చేరిపోయారు. జరీనా అన్ని సర్ది ఇషా నమాజ్ చదివి వచ్చి బెడ్‌పై చేరింది. భర్త చెవిలో ఇయర్ ఫోన్స్‌లో ఏదో లెసన్ వింటున్నారు. అలా వినే ఇప్పటికే ఫరీద్ చాలా ఈ-సర్టిఫికెట్స్ సంపాదించారు. ఇర్ఫానా పుస్తకంలో దొరికిన లెటర్ విషయం భర్తతో చేపుదామా వద్దా, లేదా రెండు రోజులు చూసి ఇర్ఫానాని నిలదీసి అడుగుతే సరి అనుకుంది. భర్త ఫోన్ తీసేసి ఏమోయ్! ఏదో పరధ్యానంలో ఉన్నావ్, రేపటి వంట గురించా అంటూ కబుర్లు చెబుతూ నిద్రకు ఉపక్రమించారు. జరీనాకు తన అన్న గుర్తుకు వచ్చాడు. ఆఫీసు పని మీద వారంలో ఓ సారి సిటీకి వస్తుంటాడు, వీలును బట్టి ఇంటికి వస్తుంటాడు. వచ్చేటపుడు పిల్లలకు స్వీట్స్ అవి తెస్తుంటాడు. అన్నకు రేపు ఫోన్ చేయ్యాలి అనుకొని రిలాక్స్‌గా జరీనా నిద్రకు ఉపక్రమించింది.

ఉదయం అందరు వెళ్ళిపోయాక జరీనా తన అన్నకు ఫోన్ చేసింది. ఎప్పుడు వస్తున్నావన్నా, వస్తే ఒక సారి వచ్చి వెళ్ళమంది. ఏమ్మా ఏదన్నా అవసరమా అంటూ, ఆల్రెడి నేను మీ ఊర్లోనే ఉన్నా ఓ గంట పని చూసుకుని వస్తా అన్నాడు. జరీనాకు కొద్దిగా ధైర్యం వచ్చింది. చెప్పినట్లె అన్న వాహెద్ పండ్లు, పిల్లలకు ఏవో గేమ్స్ ప్యాడ్స్ తీసుకొని వచ్చాడు. టిఫిన్ చెయ్యమంటే వద్దమ్మా తరువాత కొద్దిగా టీ ఇద్దువులే అన్నాడు. జరీనా అన్నయ్య చేతిలో ఇర్ఫానా పుస్తకంలోని కాగితం పెట్టింది. ఇవి మాములే లేమ్మా.. అసలు అలాంటిది ఉంటే ఈ కాగితం నీకు దొరకదు, ఇర్ఫానా కాలేజీ నుండి వచ్చాక నేను అడుగుతాగా అంటు చెల్లెల్ని సముదాయించాడు. అది కాదన్నయ్యా ఓ సారి కాలేజి వెళ్ళి ప్రిన్స్‌పాల్ మేడంను కలుద్దాం, ఆమె కొద్దిగా అబ్జర్వేషన్ చేస్తుంది అంది. సరేలే ఇపుడే పోదాం అంటూ జరీనాతో కలిసి వాహెద్ కాలేజీకి వెళ్ళారు.

ఉదయం ప్రిన్స్‌పాల్‌ను ఛాంబర్‌లో కలిసారు. కాలేజిలో ప్రతి విద్యార్థి పేరుతో సహా గుర్తుంచుకో గల కెపాసిటి ప్రిన్సిపాల్ జేస్సివాట్స్‌కు ఉంది. మంచి విద్యా, నడవడిక గల వెరి ఓల్డ్ కళాశాల కాబట్టి పెద్ద పెద్ద రాజకీయ నాయకులు సైతం తమ పిల్లల్ని ఇక్కడే చేరుస్తారు.. ఇర్ఫానా పేరు చేబితేనే, 'ఓ వెరీ నైస్ గుడ్ గర్ల్. మోరోవర్ సీ ఈజ్ వెరీ ఇంటెలిజెంట్' అంటూ ఇర్ఫానాను తప్పక యూపిపీయస్‌కు ప్రిపేర్ చేద్దాం అంటు చేప్పుకొచ్చారు. అటెండర్ టీ ఇచ్చి వెళ్ళింది. ఏం లేదు మేడమ్! ఇర్ఫానా పుస్తకంలో ఓ చీటీ దొరికింది, మా సిస్టర్ ఆందోళన పడుతుంటే విషయం మీ దృష్టికి తీసుకొద్దాం అని వచ్చాం అంటూ వాహెద్ వివరించబోయారు.

ప్రిన్స్ పాల్ ఒక్క సారిగా గట్టిగా నవ్వేసారు. నో..నో ఇర్ఫానా ఈజ్ వెరీ గుడ్ గర్ల్ అంటు ఈ కాగితం నేను అప్పుడే చించి వేసాను అనుకున్నాను. డోంట్ వర్రి, నాలుగు రోజుల క్రితం ఓ ఫస్టియర్ అబ్బాయి ఇర్ఫానా క్లాస్‌లోని ఒక అమ్మాయి వైపు ఈ కాగితం పీస్ విసిరాడు. ఆ అమ్మాయి కాస్త ఏడుస్తు కూర్చుంటె, మన ఇర్ఫానా వాని చెంప వాయగొట్టి నా దగ్గరికి ఈడ్చుకొని వచ్చింది. వానికి టీసి ఇచ్చేవారం అంతలో వాడి అబ్బాఅమ్మ వచ్చి కాళ్ళా వేళ్ళా పడి, ఇంకోసారి ఇలాంటివి చేయను అని క్షమాపణ చెప్పి లెటర్ వ్రాసి ఇచ్చినాడు. నెక్స్ట్ డే అసెంబ్లీలో ఇర్ఫానా పెద్ద స్పీచ్ ఇచ్చింది. "మనం చదువుకోవడానికి వచ్చాం. మన పేరెంట్స్ ఎంతో కష్టపడి మనల్ని చదివిస్తున్నారు. మన దృష్టి చదువు మీద ఉండాలి, ఈ వయసు చాలా ముఖ్యమైంది" అంటూ పెద్ద స్పీచే ఇచ్చింది. స్టాఫ్ సైతం ఇర్ఫానాను మెచ్చుకున్నారు అంటు డోంట్‌వర్రి సీ ఈజ్ వెరీ గుడ్ గాళ్ అంటు మరోసారి ఊత పదంగా మెచ్చుకున్నారు. హమ్మయ్యా ఊపిరి పీల్చుకుంది జరీనా. ప్రిన్సిపల్ దగ్గర సెలవు తీసుకొని వచ్చేసారు.

సాయింత్రం భర్త వస్తూనే జరీనా తన అన్నతో కాలేజికి వెళ్ళినట్లు ఇర్ఫానా విషయం మొదలు పెట్టింది. మొద్దు ముఖమా! అంటు ప్రేమతో భార్యను దగ్గరకు తీసుకుంటూ ఆ విషయం ఆ రోజే ఇర్ఫానా నాకు చెప్పింది. నీకు చెబితే, నీకు అర్థంగాక ప్రేమలు దోమలు అని ఎక్కడో ఆందోళన పడుతావో అని చెప్పలేదు అన్నాడు. అంతలోనే కాలేజి నుండి వస్తున్న కూతురును రామ్మా నీవు గుడ్ గర్ల్ అని మీ ప్రిన్సిపల్ మెచ్చుకున్నారు అంటు హత్తుకున్నారు. అచ్చా ఈ కాగితమా అంటూ విషయం అర్థమై ఆ ప్రేమ లేఖను చించి వేసింది ఇర్ఫానా.. ✤

అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతహు !
సోదర సోదరీమణులకు మా ఆత్మీయ ఆహ్వానం
హజ్-ఉమ్రా యాత్రలకు మా ద్వారా ప్రయాణించండి.
అల్ ఫుర్ఖాన్
హజ్ ఉమ్రా సర్వీస్
ఫారూఖ్ నగర్ మసీదు దగ్గర బందరు రోడ్డు, విజయవాడ - 7
9666197766, 9494115561

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది — ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

85 ఆయత్‌లు — మక్కా అవతరణ

# 40. అల్ మూ'మిన్

64 – 65 ఆయనే కదా అల్లాహ్, మీ కొరకు భూమిని నిలకడనిచ్చే స్థలంగా తీర్చిదిద్దాడు,[89] పైన ఆకాశపు గుమ్మటం కట్టాడు.[90] ఆయనే మీ ముఖాన్ని రూపొందించాడు, ఎంతో ఉత్తమమయినదిగా రూపొందించాడు. ఆయనే మీకు పరిశుద్ధ పదార్థాల జీవిక నిచ్చాడు.[91] ఆ అల్లాహ్ (ఇవన్నీ చేసినవాడు) మాత్రమే మీ ప్రభువు. అగణ్య శుభాలవాడు ఆ విశ్వప్రభువు. ఆయనే నిత్య సజీవుడు,[92] ఆయన తప్ప మరే ఆరాధ్యుడూ లేడు. ఆయనకే మీరు మొరపెట్టుకోండి– మీ ధర్మాన్ని ఆయన కోసమే ప్రత్యేకించుకుని.[93] స్తుతిసర్వమూ విశ్వప్రభువు అల్లాహ్‌కే అంకితం.[94]

89. వివరాలకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.5, అన్ నమ్ల్ : పాద సూచికలు 74, 78.

90. అంటే, మిమ్మల్ని బహిరంగ వాతావరణంలో వదలి పెట్టలేదు, ఊర్ధ్వలోకాల ఆపదలు వర్షంలా కురిసి మిమ్మల్ని సర్వనాశనం చేసివేయడానికి. భూమండలంపైన ఒక పటిష్ఠ మయిన గగన వ్యవస్థను (చూసే కళ్ళకు గుమ్మటంలా కనిపిస్తున్నదానిని) నిర్మించాడు. దాన్ని దాటుకుని ఏ వినాశకర వస్తువూ మిమ్మల్ని చేరుకోజాలదు. కడకు గగనతలంలోని సంహారక కిరణాలు సయితం చేరుకోలేవు. ఈ కారణంగానే మీరు ప్రశాంతంగా సుఖంగా భువిలో జీవించగలుగు తున్నారు.

91. అంటే, మిమ్మల్ని పుట్టించడానికి ముందు మీ కోసం ఇంతటి భద్రమయిన, ప్రశాంతమయిన నివాస స్థలం పొందుపరిచాడు. తరువాత మిమ్మల్ని పుట్టించినపుడు అత్యంత అనువయిన అవయవాలు, అత్యున్నత స్థాయి శారీరక మానసిక శక్తులతో పాటు మీకు ఒక ఉత్తమమయిన శరీరాన్ని ప్రసాదించాడు. ఈ నిటారు ఎత్తు, ఈ చేతులు, ఈ కాళ్ళు, ఈ కళ్ళు, ముక్కు చెవులూ, మాటలాడే ఈ నోరు, అత్యుత్తమ సామర్థ్యాలున్న మేధస్సు మీరు స్వయంగా చేసుకుని రాలేదే; మీ తల్లిదండ్రులూ వీటిని నిర్మించ లేదు, మరే 'వలీ' గాని, ప్రవక్తగాని, దేవతగాని వీటిని నిర్మించగల శక్తి కలిగిలేరు. వీటిని నిర్మించేవాడు ఆ విజ్ఞతామూర్తి, కరుణా మయుడు, పరమ శక్తిమాన్యుడయిన స్వామి. ఆయన మానవునికి ఉనికినివ్వాలని నిర్ణయించుకున్నప్పుడు, ప్రపంచంలో పనిచేయ గలగటానికి అతనికి ఇటువంటి అనుపమ శరీరం ఇచ్చి మరీ పుట్టించాడు. పుట్టిన తరువాత, ఆయన దయతోనే మీరు, మీ కొరకు, ఒక పరిశుద్ధమయిన విశాల శుభవరాల విస్తరి పరచి ఉండగా చూశారు. అన్నపానీయాల పరిశుద్ధమయిన సామగ్రి విషమయం కాదు, ఆరోగ్యదాయకమయింది చేదు, వెగటయినది కాదు, రుచికరమయినది కుళ్ళిపోయిందీ మురిగిపోయిందీ కాదు, దుర్వాసన గలదీ కాదు, సుగంధభరితమయినది జీవంలేని పొట్టు కాదు, విటమినులు, ప్రయోజనకరమయిన ఆహార పదార్థాలతో సుసంపన్నమయినది మీ శరీర పోషణకు, పెరుగుదలకు అత్యంత అనువయినది. ఈ నీరు, ఈ ధాన్యాలు, ఈ కూరగాయలు, ఈ ఫలాలు, ఈ పాలు, తేనె, ఈ మాంసం, ఉప్పుకారం, సుగంధ ద్రవ్యాలు, మీ ఆహార అవసరాలకు ఎంతో అనుకూలమయినవి, మీకు జీవించే శక్తిని మాత్రమే కాదు, జీవిత రుచిరాన్నీ అందజేయడానికి కూడా ఎంతో సముచితమయినది. ఇవన్నీ ఇంత విరివిగా ఈ ధరణిలో సంప్రాప్తమయ్యే ఏర్పాటు చేసిందెవరు, ఆహారపు ఈ అపరిమితమయిన నిధులు భువి నుండి వెంట వెంటనే పైకి వచ్చి, వాటి అందుబాటులో అంతరాయమూ రాకుండా ఈ ఏర్పాటు ఎవరు చేశారు? కేవలం మిమ్మల్ని పుట్టించడం జరిగి ఈ ఉపాధి వనరుల ఏర్పాటు జరగకపోయి ఉన్నట్ల యితే ఆలోచించుకోండి మీ జీవితపు రంగు ఎలా ఉండేదో! ఇదంతా, మిమ్మల్ని పుట్టించినవాడు కేవలం సృష్టికర్త మాత్రమే కాదు, విజ్ఞతా సంపన్నుడయిన కర్త, కరుణామయుడయిన పోషకుడు అని చెప్పేందుకు నిదర్శనం కాదా?(మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.3, హూద్: పాద సూచి 6 సం.5, అన్ నమ్ల్: ఆయత్ 60–65, పాద సూచికలు 73 – 83).

92. అంటే, అసలయిన, వాస్తవమయిన జీవితం ఆయనదే. స్వశక్తి ఆధారంగా జీవించి ఉన్నవాడు ఆయన మాత్రమే. అనాది, అనంత, శాశ్వత జీవితం ఆయనకు తప్ప మరెవరికీ లేదు. మిగతా అస్తిత్వాలన్నింటికీ జీవితం అనుప్రసాదిత మయినదీ, తాత్కాలికమయినదీ, మృత్యు సన్నిహిత మయినదీ తనలోనే తన వినాశం ఆశ్రితమయినదీను.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (4వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## 1. సాక్ష్యాధారాల ప్రకరణం

### అధ్యాయం : 15 ఇఫ్క్ (అపనింద) సంఘటన

### స్త్రీలు పరస్పరం ఒండొకరిలోని మంచిని గురించి సాక్ష్యమివ్వటం (25వ హదీసు గత సంచిక తరువాయి)

నా దృష్టిలో, నా వ్యవహారం ఖుర్‌ఆన్‌లో ఆదేశం అవతరించదగినంత కీలకమైనది కాదు. కాకపోతే దైవప్రవక్త (సఅసం) కలగంటారనీ, ఆ కలలో అల్లాహ్ ఆయన(స)కు వాస్తవం తెలియజేసి, నన్ను నిర్దోషిగా తెలియజేస్తాడని మాత్రం తలపోశాను. దైవసాక్షి! ఆయన(స) తన చోటినుండి లేవకముందే, ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారు బయటికి వెళ్ళకముందే ఆయన(స)పై 'వహీ' అవతరించింది. వహీ అవతరించినప్పుడు (తీవ్రమైన ఒత్తిడి వల్ల) ఆయన(స)కు చెమటలు పట్టేవి. ఈసారి కూడా అదే పరిస్థితికి ఆయన(స) లోనయ్యారు. చెమట బిందువులు ముత్యాల్లా ఆయన(స) పవిత్ర మేను నుండి రాలసాగాయి. నిజానికి అది చలికాలం. వహీ అవతరణ పూర్తవగానే ఆయన చిరు మందహాసం చేశారు. ఆ క్షణంలో ఆయన(స) నోట వెలువడిన మొదటి మాట, "ఆయిషా! అల్లాహ్‌ను స్తుతించు. ఆయన నిన్ను నిర్దోషిగా ఖరారు చేశాడు." ఈ మాట వినగానే, 'అమ్మాయ్! వెళ్ళు. వెళ్ళి దైవప్రవక్త(స) ఎదుట నిలబడు' అని మా అమ్మ చెప్పింది. దానికి నేను, 'లేదు, దైవ సాక్షిగా! నేను ఆయన ముందు నిలబడను. నేను కేవలం దైవస్తోత్రం చేస్తాను. దైవానికే కృతజ్ఞతలు తెలుపుకుంటాన'ని[5] అన్నాను. అల్లాహ్ అవతరింపజేసిన ఆయత్ ఇది: "ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గంవారే..." (అన్ నూర్-11). అల్లాహ్ నా నిర్దోషిత్వాన్ని చాటుతూ ఈ ఆయత్‌ను అవతరింపజేసినప్పుడు అబూబకర్(రజి) గారికి మిస్తహ్ బిన్ ఉసాసా (రజి)పై చాలా కోపం వచ్చింది. అప్పటివరకూ ఆయన బంధుత్వ అనురాగంతో మిస్తాహ్ కుటుంబ పోషణా బాధ్యతను వహించేవారు. కాని యదార్థం తేటతెల్లమైన తరువాత, 'ఇక మీదట నేను మిస్తాహ్‌కు చిల్లిగవ్వ కూడా ఇవ్వను. ఎందుకంటే అతను (నా కన్న కూతురు) ఆయిషా(ర.అ)పై అభాండం మోపినవారిలో ఒకడు' అని ఆయన ఒట్టేసుకున్నారు.అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: "మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ సహాయం చేయబోమని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి. వారి (తప్పుల)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను." (అన్ నూర్: 22). అంతే. అబూబక్ర్(రజి) వెంటనే రుజువర్తనులై 'దైవసాక్షి! అల్లాహ్ నన్ను క్షమించాలన్నదే నా ఆకాంక్ష' [6] అన్నారు. లోగడ మిస్తాహ్ (రజి)కు ఇచ్చే పోషణా ఖర్చుల్ని తిరిగి ఇవ్వసాగారు. దైవప్రవక్త(స) జైనబ్ బిన్తె జహష్ (ర.అ)ను కూడా నా గురించి విచారణ జరిపారు. "జైనబ్ (ర.అ)! (ఆయిషా గురించి) నీకేం తెలుసు?" అని ఆయన(స) ప్రశ్నించినప్పుడు, 'నేను నా కళ్ళు, చెవుల విషయంలో చాలా జాగ్రత్త వహిస్తాను. (నేను ఆమెగారి విషయంలో చూసింది, విన్నది మాత్రమే చెబుతాను). దైవసాక్షి! నేను ఆమెలో మంచి తప్ప మరేదీ చూడలేదు' అని ఆమె జవాబిచ్చింది. మరి చూడబోతే దైవప్రవక్త(స) సతీమణులలో నాకు సమఉజ్జీగా ఉన్నది ఆమె ఒక్కతే. అయితే భయ భక్తుల కారణంగా అల్లాహ్ ఆమెను కాపాడుకున్నాడు.[7]

25-5. ఇది కూడా ఆమెలోని స్వాభిమానానికి, ధార్మికతకు ప్రతిబింబమే. ఏ తప్పూ చేయని మాననీమణికి ఆ క్షణంలో ఒకవైపు పౌరుషం పెల్లుబకటం, మరోవైపున దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో అంతరాళం ఆనందాతిశయంతో ఉవ్విళ్ళూరటం సహజం. ఆ క్షణంలో ఆమె కేవలం ఒక ప్రవక్త అనుయాయి మాత్రమే కాదు, ఒక భర్తకు భార్య కూడా అన్న సంగతిని మరువరాదు.

25-6. మహనీయ అబూబకర్(రజి)లోని మంచితనానికి, ఉపకార భావానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. కన్న కూతురిపై అభాండం మోపిన వారితో కుమ్మక్కు అయ్యాడన్న సాకుతో ఆయన జీవి తాంతం మిస్తాహ్ పట్ల సద్వ్యవహారం చేయటం మానుకోలేదు. పైగా దైవాదేశానికి తలవంచుతూ మిస్తాహ్‌ను క్షమించారు. దేవుని క్షమాభిక్ష తనకు ఎంతైనా అవసరమని గుర్తించారు. మిస్తాహ్ పోషణా బాధ్యతను తిరిగి కొనసాగించారు- రజిఅల్లాహు అన్హు.

25-7. ఇది హజ్రత్ జైనబ్ బిన్తె జహష్(ర.అ)లోని దైవభీతికి, నిష్పక్ష పాత బుద్ధికి ఒక మచ్చుతునక. హజ్రత్ ఆయిషా(ర.అ) జైనబ్ సాక్ష్యంపై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "ఆమె కూడా నా సవతి. అయితే ఆమెలోని ధర్మపరాయణత కారణంగా అల్లాహ్ ఆమెను వక్రభాష్యం నుండి కాపాడాడు"- ఈ అధ్యాయంలో ప్రధానాంశం కూడా ఇదే.




# బద్ర్ మైదానం

- ఎస్.ఎమ్. మలిక్

**ప్రవక్త** మహనీయులు, తాను నియమించిన వేగుల వారి ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూనే ఉండేవారు. సిరియా వెళ్ళే దారిలో ప్రవక్తశ్రీ(స) గస్తీ దళాలు నియమించిన విషయం మక్కా కురైష్ నాయకులకు తెలుసు. ఆ కాలంలోనే (హిజ్రీ, రెండవ సంవత్సరం, 6వ నెలలో) అబూ సుఫ్యాన్ సిరియా నుండి దాదాపు 40 మంది రక్షకులతో వందల ఒంటెల మీద వ్యాపార సామగ్రితో వస్తున్నట్టు సమాచారం అందింది. మరోవైపు అబూ సుఫ్యాన్, ముస్లిములు దారికాసి తన వ్యాపార బృందాన్ని దోచుకుంటారేమోనన్న భయంతో ఓ వ్యక్తిని ముందుగానే మక్కాకు పంపించి రక్షణ కోరుకున్నాడు. తదనుగుణంగా మక్కా నాయకులు అబూ జహ్ల్ ఆధ్వర్యాన తమ వ్యాపార బృందాన్ని రక్షించుకునేందుకు బయలుదేరారు. అబూ సుఫ్యాన్ తన వేగుల ద్వారా ప్రవక్తశ్రీ దళాలు తన దారిన రావడం లేదని తెలుసుకుని తన దారి మార్చుకుని సురక్షితంగా మక్కా వైపునకు పయనమయ్యారు. అయితే అప్పటికే మక్కావాసులు బయలుదేరి బద్ర్ మైదానం సమీపానికి చేరుకున్నారు. అటు ప్రవక్త మహనీయులు (స) సయితం మదీనా దిశలో దాదాపు బద్ర్ మైదానానికి సమీపాన, చేరుకుని సమాచారం సేకరించడం మొదలెట్టారు. కురైష్ నాయకులు దాదాపు వెయ్యి మందితో ఎంతో అట్టహాసంగా బద్ర్ వద్దకు రానున్నారని తెలుసుకున్నారు. వారి లక్ష్యం యుద్ధమే అన్నట్టు కూడా ఆయన(స) గ్రహించారు.

### ముస్లిముల భావోద్రేకాలు

కురైష్ నాయకులు వైభవోపేతంగా బయలుదేరిన సమాచారం అందిన తరువాత ప్రవక్తశ్రీ(స) ముస్లిములను సంబోధించి పరిస్థితి విడమర్చి తెలిపారు. ఆపైన వారి సలహాని అర్థించారు. అప్పుడు మహనీయులు అబూబక్ర్, సఅద్ బిన్ ముఆజ్ లేచి ఉపన్యసించి తమ భావావేశాలను వ్యక్తం చేశారు. అబూబక్ర్, "దైవం మీకు ఏ బాధ్యతనయితే అప్పగించి పంపాడో దాన్ని నెరవేర్చడానికి ఉద్యుక్తులవండి, మేము మీకు తోడుగా ఉన్నాము, ఇంకా మూసా(అ)తో బనీ ఇస్రాయీల్ పలికినట్లు 'మీరూ మీ ప్రభువు వెళ్ళండి, పోరాడండి, మేము ఇక్కడ ఉపవిష్టులయి ఉంటాము' అని మేము పలకము; మీరు ఎంతదూరం వెళ్ళినా మేము మీతోపాటే ఉంటాము" అని అన్నారు.

అలాగే సఅద్ బిన్ ముఆజ్ ఎంతో ఉద్రేకంతో, "ప్రవక్తా, మిమ్మల్ని సత్యంతోపాటు ప్రభవింపజేసిన దైవం మీద ఒట్టు, మీరు మమ్మల్ని సముద్రం వద్దకు తీసుకువెళ్ళి అందులోకి దుమకమన్నా మేము వెనుకాడము, మాలో ఏ ఒక్కడూ వెనుకంజ వెయ్యడు; దైవం మా ద్వారా మీ కంటికి చలువను ప్రసాదిస్తాడు, మా కార్యశీలతను చూసి మీరు సంతోషపడతారు" అని గట్టిగా చెప్పారు.

ప్రవక్తశ్రీ(స) ప్రసన్నులయి ఉభయ వర్గాల కొరకు 'దుఆ' (ప్రార్థన) చేసి, ఇరువురి ప్రసంగాలను ఎంతో కొనియాడారు.

ఆ తరువాత ప్రవక్త మహనీయులు(స) బద్ర్ మైదానంలో మదీనా వైపున ఎత్తున గల ప్రాంతాన్ని ఎన్నుకుని అక్కడ తమ బిడారును నిలిపారు. ఖురైషీలు సయితం బద్ర్ మైదానంలో పల్లపు ప్రాంతాన తమ క్యాంపు వేశారు. బద్ర్ మైదానంలో ఉన్న నీటి బావులు మదీనా దిశలో ఉండేవి. ఆ రోజున వర్షం కురిసింది. ఎత్తున ఉన్న ప్రదేశంలో ఇసుక నిండిన నేల కారణంగా వర్షం నీరు ఇంకిపోయి నేల గట్టిపడింది. బావుల్లో నీరూ నిండిపోయింది. పల్లపు ప్రాంతం బురద బురదగా మారిపోయింది. ప్రవక్త సహచరులు క్యాంపు చేసిన చోటు నడవడానికి సౌలభ్యం చేకూర్చితే ఖురైష్ జనులు గుడారాలు వేసిన చోట నడవడానికి ఇబ్బందికరంగా పరిణమించింది. ఆ తరువాత ప్రవక్తశ్రీ కొరకు నీడనిచ్చే ఒక వసారా వేసి అక్కడ కూర్చోబెట్టారు సహచరులు. అప్పుడు పోరుకు వచ్చిన ముస్లిముల సంఖ్య 317 మాత్రమే. మూడు గుర్రాలు, 70 ఒంటెలు వారికి వాహనాలుగా సమకూరాయి.

## ఓ మంచి సలహా

ఖురైష్ తమ శిబిరంలో స్థిమితంగా కూర్చున్న తరువాత ప్రవక్త(స) సహచరులు ఎంత మంది వచ్చారో కాస్త అంచనా వెయ్యడానికి ఓ వ్యక్తి, అమ్ర్ బిన్ వహబ్‌ని పంపారు. అతను గుర్రం ఎక్కి ప్రవక్త శిబిరానికి దూరంగా చుట్టూ గుర్రాన్ని దౌడు తీయించాడు. అతను వచ్చి దాదాపు మూడు వందల మంది ఉంటారని సమాచారం అందజేశాడు. అయితే వారి వద్ద కత్తులు తప్ప మరే ఆయుధం లేదని, రక్షణకు ఎటువంటి సాధనాలు లేవని కాని వారు ఒక్కరు కూడా మిమ్మల్ని ఒక్కరినయినా చంపనిదే తాము చావరని కూడా చెప్పాడు.

అప్పుడు ఉత్‌బా లేచి ప్రసంగం చేశాడు, "ఖురైష్ ప్రజలారా, మీరు ముహమ్మద్‌తో అతని సహచరులతో పోరాడి ఏమి సాధించదలిచారు? మీరు వారందరినీ సంహరించినట్లయితే, దైవం సాక్షి మీరు ఆ తరువాత ఒండొకరి ముఖాలు చూడటానికి ఏవగించుకుంటారు. మనలో ప్రతి ఒక్కరు మన దాయాదులనే చంపినవారమవుతాము. అందరూ మన కుటుంబం, వంశంలోని వారే. కనుక నా మాట విని వెనక్కి మరలండి, మిగతా అరబ్బులే వారిని చూసుకుంటారు. అరబ్బులు వారిని తుదముట్టిస్తే మీ లక్ష్యం నెరవేరినట్లే. అలాకాక మరోవిధంగా జరిగితే మీరు వారితో పోరాడలేదన్న విషయం వారి సమక్షంలో సదా ఉంటుంది".

ఆ మాటలు అబూ జహ్లుకు అందినప్పుడు అతను, "దైవం సాక్షి, ముహమ్మద్‌ని, అతని అనుచరుల్ని చూసినప్పటి నుంచి ఉత్‌బాకు భయం ఆవహించింది. అలా ఎన్నటికీ జరగదు. మాకూ, ముహమ్మద్‌కు మధ్యన దైవం ఏదో ఒక తీర్పు చెయ్యనిదే మేము తిరిగి వెళ్ళము. ముహమ్మద్, అతని అనుచరులు అందరూ కలసి మూడువందల మందే ఉన్నారని తెలుసుకుని, వారిలో తన కుమారుడూ ఉన్నారన్న విషయమూ తెలుసు కాబట్టి, అతను భయపడుతున్నాడు, అంతే!" అన్నాడు.

ఆ పైన వ్యవహారం ముదిరిపోయింది, సౌజన్యత కుదిరే అవకాశాలు సన్నగిల్లాయి. అందరూ యుద్ధానికే సన్నద్ధులయ్యారు.

## సత్యాసత్యాలు వేరయ్యాయి

యుద్ధం మొదలయినప్పుడు తిరస్కారులకు తమ శక్తిపైన, తమ బలాధిక్యతపైన ఎనలేని గర్వం, అత్యల్ప సంఖ్యలో ఉన్న ముస్లిముల పట్ల చులకన భావన మెండుగా ఉండేది. ముస్లిముల సంఖ్యా బలమే కాదు, ఆయుధ బలం కూడా నామమాత్రమయి నదే. మదీనా అనే ఓ చిన్న నగరం, కొన్ని వేలకన్నా సంఖ్యాబలం లేని గ్రామం, ఈ పోరు ద్వారా మొత్తం అరేబియాతో పోరుకు సిద్ధమయింది. వీరికి తమ ధర్మం, దాని సత్యత పట్ల గల అపారమయిన నమ్మకం వల్ల, దాని సమక్షంలో తమ వ్యక్తిగత ప్రయోజనాల పట్ల ఏమాత్రం శ్రద్ధ మిగులలేదు.

యుద్ధానికి సన్నద్ధులయిన ఆ రోజు శుక్రవారమని, రమజాన్ నెల 17వ తేదీ అని చరిత్రకారులు తేల్చి చెప్పారు. అంటే క్రీ.శ. 624, మార్చి నెల 13వ తేదీ.

తొలుత ఉత్‌బా, షైబా, వలీద్ అనే గొప్ప వంశీయులయిన ఖురైష్ నాయకులు సైన్యం నుంచి వేరయి ముందుకు వచ్చారు. వారు, తమ వంశ స్థాయికి తగ్గ ఖురైషీ నాయకులో లేదా వారికి సమ ఉజ్జీలో ముందుకు వచ్చి పోరాడాలని కోరారు. ప్రవక్తశ్రీ(స) అలాగే ఉబైదా బిన్ హారిస్, హమ్జా (ప్రవక్త బాబాయి), అలీ (బాబాయి కుమారుడు, అల్లుడు) (రజిఅల్లాహు అన్‌హుమ్)ని రంగంలోకి దింపారు. వీరిలో అందరికన్నా వయసు మీరిన ఉబైదా ఉత్‌బాని, హమ్జా షైబాని, అలీ వలీద్‌ని మార్కొన్నారు. కాస్సేపటిలోనే ఆ ముగ్గురు ఖురైష్ వంశీయుల్ని సమ ఉజ్జీలు, ఖురైషీలే అయిన ముగ్గురు ముస్లిములు సంహరించడంలో సఫలురయ్యారు.

ఆ తరువాత ఇరు సేనలు ముఖాముఖీగా ఎదురయ్యాయి. ప్రవక్తశ్రీ, తాను ఆదేశించనిదే దాడి చెయ్యరాదని, వారు చుట్టు ముడితే రక్షణార్థం మాత్రం అంబులు కురిపించాలని ముందే తాకీదు చేసి పెట్టారు. ఇంకా ఇస్లామీయ యోధుల్ని బారులు తీరి ఉత్తమ సైనికుల్లా ఏమాత్రం క్రమశిక్షణ మీరకుండా మసలు కోవాలని బోధించారు. యోధుల వరుసల పర్యవేక్షణ ముగిసిన

తరువాత ప్రవక్త మహనీయులు(స) తన ప్రభువు సమక్షంలో చేతులెత్తి ప్రార్థన, వేడుకోలు మొదలెట్టారు.

> ప్రభూ! నీవు ఈ పిడికెడు మంది సముదాయాన్ని అంతమవడానికి వదలిపెడితే ఇక నీ నామధేయాన్ని సంస్మరించి ఆరాధించేవారు పుడమిలో పూజ్యమయి పోతారు.

ఆ తరువాత ఖురైషీల పక్షాన బాణాలు రావడం మొదలయింది. అప్పుడు ప్రవక్తశ్రీ(స) తన యోధులకు దాడి జరిపే ఆనతి ఇచ్చారు. అంతే, ముస్లిమ్ యోధులు ఒక్కసారిగా శత్రువులపైకి లంఘించారు. కాసేపటిలోనే ఖురైషీలు పరాజయం చవిచూశారు. వారి యోధానుయోధులు వధించబడ్డారు. వెంటనే ప్రవక్త ఆదేశాను సారం ఖురైషీలను పట్టి బందీలు చెయ్యసాగారు కొందరు సహచరులు. మహనీయ సఅద్ బిన్ ముఆజ్ శత్రువుల్ని ఖైదీలుగా బంధించడాన్ని ఇష్టపడలేదు. ఆయన శత్రువుల్ని, వాస్తవానికి బహు దైవారాధకులయిన తిరస్కారుల్ని సంహరించి ఈ పీడనను చిరకాలానికి గాను వదిలించుకోవాలని కోరుకున్నారు, కాని ప్రవక్త ఆదేశాన్ని కాదనలేకపోయారు.

## ఉన్నత విశ్వాసం

ఖురైష్ మృతులనందరినీ ఓ గుంట తీసి అందులో వేసి పూడ్చమని ఆదేశించారు ప్రవక్త. అలా మృత కళేబరాలను ఈడ్చుకు వచ్చి అందులో పడవేయసాగారు సహచరులు. అబూ హుజైఫా, తన తండ్రి ఉత్బా కళేబరాన్ని అలా ఈడ్చుకు వచ్చి ఆ గుంటలో వేయడం చూసి కాస్త బాధపడినట్లు గమనించి ప్రవక్తశ్రీ(స)

"అబూ హుజైఫా! నీ తండ్రి కళేబరం చూసి బహుశా నీకు బాధ కలిగినట్లుంది" అని అడిగారు.

"కాదు ప్రవక్తా! నాకు నా తండ్రి తిరస్కారం, లేదా ఆయన ఇలా చంపబడటం పట్ల బాధగా లేదు, ఆయన గురించి నాకు తెలుసు, కాని ఆయన ఎంతో బుద్ధిమంతుడు, సంయమన శీలి, ఉన్నత గుణ సంపన్నుడు, అందువల్ల ఆయన గుణగణాలు ఆయన్ని ఇస్లామ్ వైపునకు దారి చూపుతాయని ఆశించాను. కాని తద్భిన్నంగా ఆయన తిరస్కారిగానే మృతి చెందడం వల్ల, నా ఆశ అడియాస అయినందుకు మనస్తాపం కలిగింది" అని విన్నవించుకున్నారు.

ఆ విధంగా ఖురైష్ తన శక్తి, గర్వం, వైభవం అన్నీ ప్రదర్శించి ఆయుధ బలం రీత్యాను, మానవశక్తి ఆధారంగానూ, వైభవ ప్రతాపాల విధంగా చూసినా ఏవిధంగానూ సరితూగని ముస్లిముల సమక్షంలో, దైవమార్గంలో తమ సర్వస్వాన్ని ధారపోయడానికి వచ్చిన త్యాగశీలుర సమక్షంలో చిత్తుచిత్తుగా ఓడిపోయి పలాయనమవడం భూమీ ఆకాశాలు రెండూ తిలకించాయి.

ఈ నిర్ణయాత్మకమయిన విజయం ఇస్లామ్‌ను ఓ గణనీయమయిన శక్తిగా రూపొందించింది. అందువల్లనే బహుశా ఓ పాశ్చాత్య పరిశోధకుడు ఇలా వ్రాయడానికి వెనుదీయలేదు :

> "బద్ర్‌కు పూర్వం ఇస్లామ్ కేవలం ఒక మతంగాను, ఒక రాజ్యంగాను ఉండేది. కాని బద్ర్ తరువాత అది ఒక "రాజ్యధర్మం"గా, ఇంకా అది స్వయంగానే ఓ రాజ్యంగా రూపొందింది."

వంశావళి, రక్త బాంధవ్యం, భాష సమైక్యత, భూమి ప్రేమ ఇత్యాదివి విశ్వాసం, నమ్మకం, మతం, ధర్మం కన్నా బలమయినవని చేసే ప్రాపగండాలో ఏమాత్రం వాస్తవం ఉందో బద్ర్ మైదానం ఘంటాపథంగా చాటి చెప్పింది. బంధుత్వ బంధాన్ని ఈ పోరు పటాపంచలు చేసి వేసింది, తమ వంశీయులనే, తెగవారినే, తమ స్వభూమికి చెందినవారినే వారి ఆప్తులు కేవలం తమ విశ్వాసం, నమ్మకాల దారిలో- జాతితత్వం మార్గాన కాదు- స్వహస్తాలతో హతమార్చారు. ఇది సిద్ధాంతాలు, విశ్వాసాలు, నమ్మకాల పోరు; జాతితత్వం, జాతి అహంభావాల రణరంగం కాదు. తమ తెగకు చెందనివారి పట్ల ప్రేమానురాగాలు, సోదరత్వ భావాలు పెంపొందించే ఉదాహరణని, రక్తం, బంధుత్వం, తెగ, కులంరీత్యా తమ వారే అయినప్పటికీ సిద్ధాంతాలు, నమ్మకాలు వేరయినందుకు విద్వేషం, వైరం సృష్టించే ఉపమానానికి ప్రతీక బద్ర్. అందుకే "బద్ర్"ని దివ్య ఖుర్ఆన్ "యోముల్ ఫుర్కాన్" అని పేర్కొన్నది- సత్యాసత్యాలను విడమర్చి ప్రస్ఫుటపరచిన దినం అని అర్థం. దివ్య ఖుర్ఆన్‌లో అల్ అన్ఫాల్ (8వ) సూరాలో 41వ ఆయత్‌లో బద్ర్ దినాన్ని సత్యాసత్యాల నిర్ణాయక దినం అని పేర్కొనడం జరిగింది.

ఆ యుద్ధంలో 70 మంది బహుదైవారాధకులు హతమయ్యారు, 70 మంది బందీలుగా పట్టుకోబడ్డారు. మిగతా సైన్యం పారిపోయింది. ముస్లిమ్ యోధులు 14 మంది అమరగతి పొందారు.

---

**ఆధారం :** *1) సీరతున్నబీ కామిల్, ఇబ్నుహిష్షామ్ : సం.1; పు.700-738*

*2) సీరత్ సర్వరె ఆలమ్ : సం.3; పు.121-136*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.5; పు.368-480*




**నా ప్రియ సోదరి, సోదరుడా!**

మరో లేఖతో మీ ముందు హాజరయ్యాను. ఈ జీవితం ముగిసాక రాబోయే కొత్త జీవితమే అసలైన జీవితమన్న విషయం మీకు తెలియజేయాలనుకుంటున్నాను. వేల, కోట్ల సంవత్సరాలుండే శాశ్వతమైన జీవితం అది. ప్రస్తుత జీవితం కొంత వ్యవధి మాత్రమే. నలభై, యాభై ఏళ్లు లేదా డెభ్భై, ఎనభై సంవత్సరాలు, మరీ అంటే వంద, నూట పాతికేళ్లు. ఇందులోనూ ఎవరి జీవిత ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికెరుక. చిన్న పిల్లలు, నిత్య యువకులు సైతం మృత్యువాత పడే సంఘటనలు మనం చూస్తుంటాము. మరణం లేని జీవితాన్నిచ్చేందుకు దేవుడు మనల్ని పుట్టించాడు. ఆ జీవితం ఎలా ఉంటుంది (సంతోషాలతో నిండినదా? దుఃఖభరితమైనదా) ఇక్కడి జీవితంలోనే నిర్ణయించుకోవాలి. మన బుద్ధీ వివేకాలతో దేవుడిని గుర్తించి, దైవాదేశాల కనుగుణంగా మంచి పనులు చేస్తామో, లేదా షైతాన్ ఉచ్చులో పడి వాడు చూపిన బాటలో నడుస్తామో నిర్ణయం మన చేతిలోనే ఉంది.

రాబోయే  జీవితమే అసలైన జీవితం. ఈ జీవితం కొన్ని రోజుల పరీక్షా సమయం. మనల్ని పుట్టించిన వాడు ఆ రాబోయే జీవితం గురించి దైవ గ్రంథంలో  గుర్తు చేస్తున్నాడు. నేను ఆ గ్రంథంలోని విషయాల అనువాదం తెలియజేస్తాను. ఈ మాటలు మన మనో ప్రపంచాన్ని మారుస్తాయని అనుకుంటున్నాను.

ఐహిక జీవిత భోగాలు అల్పమైనవి, దైవభక్తి పరాయణుడైన మనిషికి పరలోకమే ఎక్కువ మేలైనది. మీకు రవ్వంత అన్యాయం కూడా జరగదు. (దివ్య ఖుర్ఆన్ 4:77)

నరకాగ్ని నుండి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశపెట్టబడేవాడు మాత్రమే యథార్థానికి సఫలీకృతుడు. ఇక ఈ ప్రపంచం, అది కేవలం మాయావస్తువు మాత్రమే. (దివ్య ఖుర్ఆన్ 3:185)

అల్లాహ్‌తో తమ సమావేశపు వర్తమానాన్ని అబద్ధంగా పరిగణించిన వారు నష్టానికి గురి అయ్యారు. అకస్మాత్తుగా ఆ గడియ వచ్చిపడినప్పుడు వారే వాపోతారు: "అయ్యో! ఈ విషయంలో మేము ఎంత పొరపాటు చేశాము!" అని. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే, తమ పాపాల బరువును తమ వీపులపై మోస్తూ ఉంటారు. చూడండి! వారు మోస్తున్న ఈ బరువు ఎంత చెడ్డదో! ఇహలోక జీవితం ఒక ఆట, ఒక తమాషా మాత్రమే.  వాస్తవానికి నష్టం నుండి తప్పించుకొనగోరే వారికి పరలోకవాసమే అత్యంత శ్రేష్ఠమైనది. అయితే మీరు బుద్ధిని ఉపయోగించరా? (దివ్య ఖుర్ఆన్ 6:31-32)

మనం ఎక్కడి నుండి వచ్చామో ఎక్కడికెళ్లాలో ప్రశాంత మనస్సుతో ఆలోచించండి. ప్రతీ చిన్న సమస్య పరిష్కారం కోసం ఎంతో ఆచితూచి అడిగేసే మనం జీవిత లక్ష్యం గురించి ఎందుకు ఆలోచించము?



– హుమేరా అమీర్,
ఏలూరు

# వృద్ధ వేదన

**వృద్ధాప్యము** లేదా ముసలి తనము అనేది మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, సాధారణంగా 60 సంవత్సరాల వయసు పైబడిన వ్యక్తులను వృద్ధులుగా పరిగణిస్తాం. మనిషి శరీరం రోగనిరోధక శక్తిని క్రమ క్రమంగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యంగా చెప్పవచ్చు. వృద్ధాప్య దశలో జరిగే శారీరక మార్పులను, వ్యాధులను పరిశోధించే విభాగాన్ని జీరియాట్రిక్స్ (Geriatrics) అంటారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 21న జాతీయ వృద్ధుల దినోత్సవం జరుపుకుంటారు. సాధారణంగా వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించడం అనే సమస్యతో పాటు వారి కుటుంబ సభ్యుల మూలంగా గానీ లేదా సమాజంలో గానీ వివిధ వయసు వ్యక్తుల ద్వారా కొంత వివక్షను ఎదుర్కొంటూ ఉంటారు. ఈ రెండు సమస్యలూ వయో వృద్ధులను మానసికంగానూ, శారీరకంగానూ అధికంగా ప్రభావితం చేసే అంశాలు. ఈ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి, నేటి వయో వృద్ధులు తమ జీవిత పర్యంతం సమాజానికి చేసిన సేవలను గుర్తించేందుకు ఈ "ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే" ఉద్దేశించబడింది.

ఒక వ్యక్తికి తన జీవితంలో చేయవలసిన, చేయకూడని పనుల గురించి, అదేవిధంగా చేయవలసిన పనుల సాధ్యాసాధ్యాల గురించి అవగాహన కలిగేది తన యవ్వన దశలోనే. అయితే ఈ విషయాల గురించి పూర్తి అవగాహన కలిగి, ప్రతి పనిని పూర్తి సమర్థతతో చేయగలిగేది తన మధ్య వయస్సులో. ఇక వృద్ధాప్యానికి వచ్చేసరికి జీవితంపై పూర్తి అవగాహన మాత్రమే కాదు, వయసుతో పాటు పరిపక్వత, పూర్తి అనుభవంతో తన ముందు ఉన్న మూడు తరాల వ్యక్తులను ప్రభావితం చేయగలిగిన వ్యక్తులుగా వయోవృద్ధులు ఉంటారు. అందుకే వయోవృద్ధులను తృతీయ యుగపు వ్యక్తులుగా కూడా మనం అభివర్ణించవచ్చు. ఈ వయసులో శారీరకంగా కష్టపడి పని చేయడానికి వారి శరీరం నూరు శాతం పనిచేయకపోవచ్చేమో గానీ సమాజంలో ప్రతి వ్యక్తిని ఉన్నంతగా తీర్చిదిద్దేందుకు కావలసిన మార్గదర్శకత్వం చేయడానికి మాత్రం వీరి అనుభవం చాలా అవసరమవుతుంది.

వృద్ధాప్యం అంటే రేపటి కోసం ఎటువంటి అలారమ్ సెట్ చేసుకోవాల్సిన అవసరం లేని వయసు. ఇది కేవలం అదృష్టవంతులకే దక్కే అవకాశం. అందుకే వృద్ధులు అదృష్టవంతులనే చెప్పాలి. వృద్ధాప్యం అనేది శరీరానికే కానీ మనసుకు రాదు. కొందరి విషయంలో వృద్ధాప్యం అనేది ఒక జీవిత చరమాంకంలో ఆనందకరమైన కాలం. కానీ కొందరి జీవితాల్లో వృద్ధాప్యం అనేది ఒక చీకటి కోణం.

చాలామంది ఈ వయస్సులో మానసిక సమతుల్యతను కోల్పోతారు. ఈ వయసులో వీరిని పసిపాపలవలె చాలా జాగ్రత్తగా చూసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా వృద్ధులు ఈ వయసులో సంతోషకరమైన జీవితం ఉండాలని కోరుకుంటారు. ఒంటరితనం వీరిని ఎక్కువగా బాధిస్తుంది. వృద్ధాప్యంలో అనేక సమస్యలు బాధిస్తాయి. చర్మం ముడతలు పడిపోవడం, జుట్టు తెల్లగా

మారడం, కొందరి విషయంలో బట్టతల రావడం, వినికిడి శక్తి, కంటిచూపు, జ్ఞాపకశక్తి, మెదడుకు ఆలోచన శక్తి తగ్గడం వంటి వాటితో పాటు వ్యాధి నిరోధక శక్తీ తగ్గడం జరుగుతుంది.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాధారణంగా వృద్ధాప్యంలో ఇంట్లో కూర్చుని తినే అదృష్టం చాలామంది వృద్ధులకు ఉండదు. వయసు మీద పడినప్పటికీ కుటుంబ పోషణ కోసం కష్టపడవలసి వస్తుంది. ఇటువంటివారు అందరూ కరోనా మహమ్మారి కాలంలో గత రెండు సంవత్సరాలుగా ఎంతో మానసిక, శారీరక క్షోభను అనుభవిస్తూనే ఉన్నారు.

ఒకప్పుడు మన భారతదేశంలో కుటుంబ వ్యవస్థ చాలా ఉన్నతంగా ఉండేది. ఉమ్మడి కుటుంబాల కారణంగా మూడు, నాలుగు తరాల వ్యక్తులు వృద్ధులతో కలిసి జీవించేవారు. ఇప్పుడు ఇలాంటి ఉమ్మడి కుటుంబాలు మచ్చుకైనా కనిపించడం లేదు. ఈ రోజు మన భారతదేశంలో కూడా వేలాదిగా వృద్ధాశ్రమాలు ఏర్పడ్డాయంటే కారణం వృద్ధుల పట్ల వారి కుటుంబాలలోనూ, సమాజంలోనూ కనపరిచే చిన్న చూపు. ఈ వయసులో వారికి సంపాదించే శక్తి గానీ, ఇంటి పనులలోను, బయటి పనులలోను పాలుపంచుకునే శక్తి గానీ లేకపోవడం. ఈ కారణంగానే ఈ రోజు వృద్ధులు అనగానే మోయలేని భారంగా చాలామంది భావిస్తున్నారు. వృద్ధాప్యంలో ప్రతివారు ఆనందంగా ఉండాలంటే ఇటు వారి కుటుంబాలలోనూ, సమాజంలోనూ ప్రతి ఒక్కరు వృద్ధుల పట్ల దయతో వ్యవహరించాలి.

జీవితంలో ఒక్కసారి వెనక్కి తిరిగి, పిల్లలను గానీ, వృద్ధులను గానీ పట్టించుకునే పరిస్థితిలో ఎవరూ ఉండడం లేదు. కాస్త ఆర్థికంగా మెరుగ్గా ఉండేవాళ్ళు ఇంట్లోని వృద్ధులను తీసుకెళ్లి వృద్ధాశ్రమాల్లో చేర్పించి చేతులు దులుపుకుంటున్నారు. మరికొందరైతే కన్న తల్లిదండ్రులను కూడా అనాథల్లా రోడ్లపైనే వదిలేస్తున్నారు. పెద్దవాళ్ళని ఈ విధంగా తమకు సంబంధం లేని వ్యక్తుల్లా, అనాథల్లా వదిలేసే కంటే తమ విధుల్లో పని గంటలు ముగిసేవరకు పగలంతా ఏదైనా వృద్ధాప్య సంరక్షణ కేంద్రంలో వదిలిపెట్టి తిరిగి సాయంత్రం తమతో పాటు ఇంటికి తీసుకువస్తే ఇటు కుటుంబ సభ్యుల బాధ్యత నెరవేరుతుంది, వృద్ధులకు శారీరక, మానసిక ఉల్లాసం దక్కుతుంది.

వృద్ధులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో పాటు వృద్ధాప్యంలో వచ్చే మరొక సమస్య మతిమరుపు. సాధారణంగా మతిమరుపు వంటి లక్షణాలు బీ12 విటమిన్ లోపమూ కారణంగా వస్తాయి. వయసు మీద పడుతున్నకొద్దీ మనం తీసుకునే ఆహారంలోని బీ12 విటమిన్ను గ్రహించే శక్తి కూడా తగ్గుతుంది. ఇది బీ12 లోపానికి దారితీస్తుంది. పైకి ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే ఈ లోపం ఎక్కువవుతుండొచ్చు.

నేడు మన చుట్టూ ఉన్న వృద్ధులకు ఉన్న మరొక సమస్య కొత్త సాంకేతికతను అందుకోలేకపోవడం. ఇక నేటి డిజిటల్ యుగంలో కొంతమంది వృద్ధులు తప్ప మిగిలిన సీనియర్ సిటిజన్లు ఈ కొత్త సాంకేతికతను అందుకోలేకపోతున్నారు. యువకులు, మధ్య వయస్కులు వాడినంత సులువుగా సెల్ ఫోన్లు, సోషల్ మీడియా, టాబ్లెట్లు, బ్యాంకింగ్ మెషీన్లు లేదా కంప్యూటర్లు లాంటి వాటిని సీనియర్ సిటిజన్లు ఉపయోగించలేకపోతున్నారు. అందువల్ల సీనియర్ సిటిజన్లు ఈ సాంకేతిక పురోగతిని ఎలా ఉపయోగించాలో నేర్చుకోవాలి.

మనకు జీవితం ఇచ్చేందుకు తమ జీవిత పర్యంతం పాటుపడిన వృద్ధుల కోసం ప్రతి వ్యక్తి రోజులో కొంత సమయాన్ని వెచ్చిస్తూ, మనకు ఆహార, సదుపాయాలు కలగజేయడం కోసం తమ జీవితంలో ఎన్నో అవసరాలను త్యాగం చేసిన తల్లిదండ్రుల కోసం మన జీవితాన్ని కొద్దిగా వెచ్చించినప్పుడు ఏ వృద్ధుడినీ అడల్ట్ కేర్ హోమ్‌కు పంపించవలసిన అవసరమే రాదు.

సీనియర్ సిటిజన్ల గుణాత్మకమైన మేలు కోసం భారత ప్రభుత్వ పథకాలు:

ప్రధాన మంత్రి వయో వందన పథకం, వరిష్ఠ మెడిక్లెయిమ్ పాలసీ, ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం (IGNOAPS), రాష్ట్రీయ వయోశ్రీ యోజన, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం జాతీయ కార్యక్రమం (NPHCE), వరిష్ట పెన్షన్ బీమా యోజన మొదలైనవి.

## వృద్ధాప్యం గురించి కొన్ని ఉత్తమమైన నిర్వచనాలు -

"వృద్ధుడవైనందుకు చింతించవద్దు. ఈ ప్రపంచంలో ఇది చాలా మందికి దొరకని ప్రత్యేకత".

"వయస్సు అనేది మనసుకు సంబంధించిన విషయం, దీనిని మీరు పట్టించుకోనంతవరకు ఇది మీకు సమస్యే కాదు"

- మార్క్ ట్వైన్

"యవ్వనం అనేది ప్రకృతి ప్రసాదించిన వరం అయితే వయసు ఒక కళాఖండం" - స్టానిస్లా జెర్సీ నెక్

"సీనియర్ సిటిజన్లు అంటే మీలో ఉన్న ఒత్తిడిని కాకుండా మీలో ఉన్న ఉత్తమమైన వాటిని బయటికి తీసుకొచ్చేవారు".

"వృద్ధాప్యం అనేది ఒక అసాధారణ ప్రక్రియ. వయసు రీత్యా ప్రతి ఒక్కరు ఇక్కడికి చేరుకోవలసిందే".

ఎవరైతే వృద్ధుల ఉన్నత స్థితిని గుర్తించి, వారిని గౌరవిస్తారో, దేవుడు ఆ వ్యక్తిని పునరుత్థాన దినం రోజున ఎటువంటి భయం కలుగకుండా కాపాడుతాడు అని చెప్పారు ప్రవక్త.




**అస్మా** స్కాట్‌లాండ్‌లోని "ఫ్లవర్స్ మెక్‌డోల్" పేరు గల ఫ్లవర్ షాపులో పనిచేస్తోంది. పెళ్ళయిన తర్వాత కొంతకాలం ఆమె ఒక సూపర్ మార్కెట్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేసేది. ఆ సేల్స్‌గర్ల్ ఉద్యోగం ఆమెకు అంతగా నచ్చలేదు. ఒకరోజు ఫ్లవర్‌షాపులో సేల్స్‌గర్ల్ ఉద్యోగం ఖాళీగా ఉందని బోర్డు చూసిన వెంటనే ఫ్లవర్‌షాపు యజమానిని కలిసి తాను ఆ ఉద్యోగంలో చేరేందుకు సుముఖంగా ఉన్నానని తెలిపింది. యజమాని వెంటనే ఆమెను ఉద్యోగంలో చేర్చుకున్నారు. ఆ ఫ్లవర్ షాపులో చేరినప్పటి నుండి అస్మా ఎంతో ఉత్సాహంగా ఉండేది.

ఫ్లవర్ షాపులో చాలా కష్టపడాల్సి వచ్చేది. అయినా గానీ ఇష్టంతో కష్టపడేది. ఉదయం ఆరింటికి దుకాణం తెరవాలి. లీఫ్ లిస్ట్ ప్రకారం అన్నీ సర్ది ఉంచుకోవాలి. ఆరున్నరకి పూల బండి నుండి పూలు అన్నీ రిసీవ్ చేసుకోవాలి. తర్వాత ఆమెతోపాటు పని చేసే మరో సేల్స్‌మెన్ షాపుకు వస్తాడు. ఇద్దరూ కలిసి పూలు బాక్సుల్లో, బొకేల వలే ఆకర్షణీయంగా అమరుస్తారు. షాపులో పూలు ఆకర్షణీయంగా కనబడేందుకు రోజూ ఒక్కొక్క స్టైల్‌లో ఫ్లవర్ వాజుల్లో వేసి ఉంచేవారు. అవి వాడిపోకుండా ఉండేందుకు ఎల్లప్పుడూ వాటిపై నీళ్ళు స్ప్రే చేస్తూ జాగ్రత్తగా చూసుకోవాల్సి వచ్చేది. పాడైపోయిన, వాడిపోయిన పువ్వులను వేరుచేసి చెత్తబుట్టలో వేసేవారు.

అస్మాకు పువ్వులంటే చాలా ఇష్టం. అందమైన రంగులు, అవి వెదజల్లే సువాసనలు ఆమెను ఎంతగానో ఆకట్టుకునేవి. ఫ్లవర్ షాపులో ఉండే కొన్ని రకాల పుష్పాలు చూపులు తిప్పుకోలేనంతగా ఆకర్షణీయంగా, అందంగా ఉండేవి. గులాబీలు, లిల్లీలు, ఆర్కిడ్లు మొదలైన పూలు తెల్లవి, గులాబీ రంగు, ఎర్ర రంగు, నీలం రంగు, ఆరేంజ్ రంగు, పసుపు రంగు, వివిధ రకాల షేడ్లు, కాంబినేషన్లు చూడముచ్చటగా ఉంటాయి.

అస్మాకు ఆంగ్లేయులు వివిధ రకాల ఈవెంట్లకు వివిధ రకాల పుష్పాలను కొనుగోలు చేయటం, వాటి టేస్ట్, సందర్భానుసారం పూలను ఎన్నుకునే విధానం ఎంతో నచ్చింది.

బర్త్‌డేలకు, పెళ్ళిళ్ళకు, ఫంక్షన్లకు, సంతాపాలకు ముఖ్యమైన వ్యక్తులతో కలవడానికి వెళ్ళినప్పుడు, ఎవరికైనా క్షమాపణలు చెప్పేందుకు, ధన్యవాదాలు తెలుపుటకు, చనిపోయినవారికి నివాళులు అర్పించేందుకు, ఎవరినైనా స్వాగతించేందుకు వివిధ రకాల పుష్పగుచ్ఛాలు, బొకేలు, బాస్కెట్లు కొత్తకొత్త హంగులతో అస్మా ఎల్లప్పుడూ కొత్త డిజైన్లను కష్టమర్లకు అందించేది. అందువల్ల కష్టమర్లు ఆమెను, ఆమె పనితనాన్ని బాగా ఇష్టపడేవారు. కొందరు ప్రత్యేకంగా అస్మా తయారుచేసిన డిజైన్ల కోసం అడ్రస్ వెతుక్కుని మరీ వచ్చి కొనుక్కునేవారు. అస్మా సేల్స్‌గర్ల్‌గా జాయిన్ అయినప్పటి నుంచి ఆ షాపు ఆదాయం అమాంతం పెరిగిపోయింది. అందువల్ల ఓనర్ అస్మా పట్ల సంతోషం వ్యక్తం చేసేవాడు.

ఫ్లవర్ షాపులో అందరి అభిరుచులకు అనుగుణంగా పుష్పాలను అందించే అందరి మన్ననలు పొందిన అస్మా జీవితంలో మాత్రం ఒక పుష్పం వెలితి ఉండేది. వివాహమై ఐదు సంవత్సరాలు నిండినా అస్మా- ఇమ్రాన్ దంపతులకు సంతాన భాగ్యం కలగ లేదు. అదే బెంగతో అస్మా ఎంతో ఉదాసీనంగా ఉండసాగింది. ఫ్లవర్ షాపులో పనితనం బాగానే ఉన్నా మునుపటి ఉత్సాహం మాత్రం ఆమె కళ్ళల్లో లోపించింది. ఈ విషయాన్ని చాలామంది కష్టమర్లు సైతం గుర్తించారు. కొందరు అస్మాను అప్పుడప్పుడూ అడిగేవారు కూడా. చిరునవ్వు చిందించి ప్రశ్నలను దాటవేసేది.

షాపులో పూలు కొనే డైలీ కష్టమర్ నఫీసా అని ఉండేది. ఆమె ఒకరోజు అస్మాను అదే పనిగా ఎందుకు నువ్వు డల్‌గా ఉంటున్నావ్? ఏదైనా ప్రాబ్లమా? అని నిలదీసింది. అస్మా దాటవేసే ప్రయత్నం చేసినా ఆమె పట్టు వదల్లేదు. ఇక చెప్పక

తప్పట్లేదు అన్నట్లు అస్మా తనకున్న సంతాన లేమి సమస్యను గురించి నఫీసాకు షేర్ చేసింది. నాలుగు సంవత్సరాల నుండి వైద్యం చేయించుకున్నా, ఎంత మంది డాక్టర్ల వద్ద చూపించుకున్నా ఎలాంటి ఫలితమూ లేదు అని వాపోయింది. దేవుడు ఎందుకు మాకే ఇలాంటి సమస్యను ఇచ్చాడో, మేమేం పాపం చేశామని... అంటూ భోరుమంది.

చింతించకు.. నీ బాధ నేను అర్థం చేసుకోగలను. అల్లాహ్‌పై భరోసా ఉంచు అంటూ సముదాయించే ప్రయత్నం చేసింది నఫీసా. ఎందుకో నాకు అదో రకమైన బెంగ, భయం, బాధ కలిపి డిప్రెషన్‌లాగ వచ్చేస్తుంది అన్నది అస్మా. పిల్లలు కలగకపోతే అందరికీ అలాగే ఉంటుంది. అలా అని బాధపడుతూ కూర్చుంటే ఏమైనా ప్రయోజనం కలుగుతుందా... ఆ వ్యాకులత పెరుగుతూ పోయి లేనిపోని జబ్బులు చుట్టుముడతాయి అన్నది నఫీసా.

ఇన్ని మందులు వాడుతున్నాము. ఇన్ని దుఆలు చేస్తున్నాము. అయినా మా పరిస్థితి మారట్లేదు ఎందుకో... అంటూ అస్మా విలపించింది. ఏదైనా పాపం చేస్తేనే పిల్లలు పుట్టకుండా పోతారని, పిల్లలు పుట్టిన వాళ్ళంతా అదృష్టవంతులు, పుణ్యాత్ములు అని అనుకుంటే పొరపాటే అస్మా! దేవుడు ఎవరి తలరాత ఎలా రాశాడో అలాగే జరుగుతుంది. అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా అన్నాడు : "ఆయన తాను కోరిన దానిని సృష్టిస్తాడు; తనకు ఇష్టమైన వారికి కూతుళ్ళను, తాను కోరిన వారికి కొడుకులనూ, తనకు ఇష్టమైన వారికి కొడుకులను, కూతుళ్ళనూ కలిపి ఇస్తాడు; తాను కోరిన వారికి అసలు సంతానమే ఇవ్వడు. ఆయనకు అంతా తెలుసు, ఆయనకు అన్నింటిపైనా అధికారం ఉన్నది." (42: 49,50)

నీ అదృష్టంలో పిల్లలు పుట్టాలని ఉంటే ఇప్పుడు కాకపోయినా, మరికొన్ని సంవత్సరాల తర్వాత అయినా తప్పక పుడతారు. నీ అదృష్టంలో పిల్లలు లేకపోతే ఎన్ని ప్రయత్నాలు చేసినా కలగరు. అది నీకూ తెలుసు కదా! లేని దాని గురించి బాధ పడుతూ కూర్చోవటం అవివేకమే. నువ్వూ, ఇమ్రాన్ కలిసి హ్యాపీగా ఉండండి. అనవసరమైన భయాలు వీడి పాజిటివ్‌గా ఉండు. అనేక జబ్బులు నయమై, మనసు ప్రశాంతంగా ఉంటుంది... అంటూ నఫీసా సముదాయించింది. నఫీసా మాటలు విన్న తర్వాత అస్మా తనను తాను కాస్త సంభాళించుకుంది.

అస్మా మునుపటి వలెనే ఉత్సాహంగా, ఆశాభావంతో ఉండసాగింది. కొన్ని రోజుల తర్వాత అస్మా గర్భవతి అయి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఫ్లవర్ షాపులోని పువ్వులన్నింటి కన్నా తన పాప బోసినవ్వులు ఎంతో అందంగా, ముద్దుగా ఉన్నాయి. డెలివరీ తర్వాత పాపను తీసుకుని ఇంటికి వచ్చిన అస్మాను ఆమె భర్త బంధువులు, ఫ్లవర్ షాపు యజమాని, ఆమె కస్టమర్లు అందరూ ఘనంగా స్వాగతించారు. అనేక మంది గిఫ్టులతో ఇంటిని నింపేశారు. ఇదంతా చూసి అస్మా ఎంతో ఆనందించింది. నఫీసా కూడా అక్కడే ఉంది. నఫీసాను హత్తుకుని మొదట పాపను ఆమెకే అందించింది. అస్మా! నీ ముంగిట పూసిన ఈ పుష్పం ప్రపంచపు అన్ని పుష్పాల కంటే అందంగా ఉంది అంటూ నఫీసా ప్రశంసిస్తుంటే దైవానికి కృతజ్ఞతలు అర్పించుకుంది అస్మా.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



# అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి!

- నసీరా బేగం

**గౌరవప్రదుడైన** అల్లాహ్ సకల శక్తులు కలవాడు. సకల సృష్టిని పాలిస్తున్నవాడు. ఆయన ఎవరి అక్కరా లేనివాడు. అందరూ ఆయన అవసరాన్నే కలిగి ఉన్నారు. భూమ్యాకాశాల నిధులన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి. అంతేకాదు, అనుగ్రహమూ, గౌరవమూ అనేవి కూడా ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన తాను కోరిన వారికి వాటిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ విశాల దృష్టి కలవాడు, తాను కోరినవారిని తన కారుణ్యం కొరకు ప్రత్యేకించు కుంటాడు. అల్లాహ్ అనుగ్రహం మహత్తరమైనది.

ప్రతి మనిషి, ప్రతి క్షణం అల్లాహ్ అవసరం కలిగి ఉన్నాడు. మనిషి వద్ద తనదంటూ ఏమీ లేదు. అన్నీ అల్లాహ్ ప్రసాదితాలే. అల్లాహ్ ప్రసాదితాలను మనిషి తన సొంతం అని భావించటం, అవి తన జీవితాంతం తనలోనే ఉంటాయనే భ్రమను కలిగి ఉండటం అవివేకం. ఆ ప్రసాదితాలన్నీ తన వద్ద ఎప్పటివరకు ఉంటాయో, ఏ స్థితిలో ఉంటాయో ఎవరికీ తెలియదు. ఈ విధంగా మనిషి జీవితం తెలిసీ తెలియని అయోమయ పరిస్థితిలో ప్రసాదితాల వెంట నడుస్తూ పోతూ ఉంటుంది. భయభ్రాంతులకు గురవుతూ ఉంటుంది. దైవప్రసాదితాలు తన వద్ద ఉన్నప్పుడు మనిషి తనను తాను అత్యంత బలవంతుడుగా భావిస్తాడు. అప్పుడు అతను తనకు ఎవరి అవసరమూ లేదని అనుకుంటాడు, అవన్నీ తన కష్టార్జితం అనే భ్రమను కలిగి ఉంటాడు. ఇక జీవితం సాఫీగా కొనసాగిపోతుందని భావిస్తాడు. సుఖ సంతోషాలతో జీవితం గడుపుతూ ఉంటాడు. కాని అది జీవిత వాస్తవికత ఎంత మాత్రమూ కాదు. ఎందుకంటే ఇహలోకం ప్రతిఫల జీవితం కాదు. పరీక్షల జీవితం. కనుక ఇక్కడి సుఖసంతోషాలు నీటి మీద బుడగ వంటివి. ఎప్పటివరకు అవి తనకు తోడ్పాటు నిస్తాయో ఎవరికీ తెలియదు. జీవిత సత్యం ప్రకారం, ఒక ప్రణాళికాబద్ధంగా హాయిగా, సాఫీగా జీవిత శకటం ప్రయాణిస్తూ అకస్మాత్తుగా ఒడిదుడుకులను, కష్టనష్టాలకు గురైనప్పుడు మనిషి ఉలిక్కిపడతాడు, బెంబేలెత్తుతాడు. తిరిగి సహాయం కొరకు తన ప్రభువు వైపునకు తిరుగుతాడు, అప్పటివరకు గుర్తుకురాని ప్రభువు కూడా అప్పుడు అతనికి వెంటనే జ్ఞాపకమొస్తాడు. చేతులెత్తి అభ్యర్థిస్తాడు. అయితే సుఖసంతోషాలు తన కష్టార్జితం అని భావించేవాడు. కష్టనష్టాలు కూడా తన కష్టార్జితంగా తొలగించుకోవచ్చనే ధీమాను అతను ఎందుకు కలిగి ఉండడు? సత్యంపై వేసిన అసత్యపు పరదాను అతను స్వయంగానే తొలగిస్తాడు. తన బలహీనతను అంగీకరిస్తాడు. దేవుడే శక్తిసంపన్నుడని బలంగా విశ్వసిస్తాడు. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు : మనిషి పైకి ఎప్పుడైనా, ఏదైనా ఆపద వచ్చి పడితే అతడు తన ప్రభువు వైపునకు మరలి ఆయనకు మొరపెట్టుకుంటాడు (39: 8) అల్లాహ్ ఈ వాక్యంలో మనిషి స్వభావాన్ని తెలియజేస్తున్నాడు. ఆపదలో అతను అల్లాహ్ తప్ప మరెవరినీ మొరపెట్టుకోడు. అల్లాహ్ కరుణామయుడు, కనికరించేవాడు కాబట్టి అతను చేసిన మొరలను ఆలకిస్తాడు. అతని ఆపదలను తప్పకుండా తొలగిస్తాడు. ఈ విషయాన్ని

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు : నీ ప్రభువు ఇలా అంటున్నాడు : నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. (40: 19)

దుఆ ఒక విశ్వాసి ఆయుధం. ధర్మానికి మూల స్తంభం. భూమ్యాకాశాల వెలుగు. ఆరాధనల సారాంశం. దుఆ ద్వారా మనిషి అల్లాహ్‌ను వేడుకుంటాడు, మాటిమాటికి వేడుకుంటాడు. కరుణ జూపమని అభ్యర్థిస్తాడు. కన్నీళ్ళతో మొరపెట్టుకుంటాడు. కేవలం అల్లాహ్‌తోనే ఒక మనిషి వేడుకుంటే అల్లాహ్ అమితానందభరితుడవుతాడు. తననే నమ్ముకుని, తనపైన ఆశలు పెట్టి అడిగినప్పుడు అతని నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా, అల్లాహ్ అతనికి తప్పకుండా ప్రసాదిస్తాడు. అది ఇహలోకంలోనూ కావచ్చు లేదా పరలోకంలోనూ కావచ్చు. అతని వేడుకోళ్ళు మటుకు ఎంతమాత్రం వృధాగా పోవు. హజ్రత్ అబూహురైరా (ర) దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారని తెలియజేశారు: అల్లాహ్ స్వర్గంలో ఒక మనిషి స్థానాలను ఉన్నతం చేస్తాడు. దానికి అతను ఓ అల్లాహ్! నా ఈ స్థానాలు ఎలా ఉన్నతమయ్యాయి? అని అడుగుతాడు. దానికి అల్లాహ్ ఇలా సమాధానమిస్తాడు. నీ తరువాత నీ సంతానం నీకు క్షమాభిక్ష పెట్టమని నన్ను వేడుకుంది. దానికారణంగా నేను నీ స్థానాలను ఉన్నతంగా చేశాను. ఎవరైతే అల్లాహ్‌ను వేడుకోరో అల్లాహ్ వారి పట్ల అసంతుష్టుడవుతాడు. (ముస్నద్ అహ్మద్)

మనిషి దుఆ చెయ్యటం ద్వారా అతని విధి రాతలో వ్రాయబడి ఉన్నవి అతనికి లభించేందుకు మార్గం సుగమమవుతుంది. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: మీరు ఎన్ని జాగ్రత్తలు పాటించినా మీ విధి వ్రాతలో వ్రాయబడి ఉన్నది తప్పకుండా జరిగి తీరుతుంది. కాని ఆపదలు అవతరించబోయినా, అవతరించిపోయినా రెండింటిలోను దుఆ మీకు ప్రయోజనాన్ని చేకూర్చుతుంది. ఆపదలు అవతరిస్తూ ఉంటాయి. దుఆ వెళ్ళి అవి అవతరించకుండా ఆపుతుంది. రెండింటి మధ్య ఈ ఘర్షణ ప్రళయం వరకు జరుగుతూనే ఉంటుంది. ఆపద ఎంతగా అవతరించదలిచినా దుఆ దానిని అంతగా అవతరించనీయదు. (తిర్మిజీ)

ఒక విశ్వాసి అల్లాహ్‌తో మొరపెట్టుకుంటూ ఉంటాడు, కన్నీళ్ళు పెట్టుకుంటూ ఉంటాడు. అప్పుడు దైవదూతలు అల్లాహ్ సమక్షంలో హాజరై 'ఓ అల్లాహ్! నీ ఫలానా దాసుడు మొర పెట్టుకుంటున్నాడు. కన్నీళ్ళతో వేడుకుంటున్నాడు. నీవైతే అవిశ్వాసులకు కూడా ప్రసాదిస్తున్నావు. కాని ఈ నీ విశ్వాసికి ప్రసాదించటంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నావు?' అని అంటారు. దానికి సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: నేను అతన్ని అల్పుడుగా భావించి అతని మొరలను ఆలకించటంతో ఆలస్యం చెయ్యటం లేదు. పైగా ఇలా చెయ్యటం అతనికి సహాయం చెయ్యటం అన్నమాట. అతని కన్నీళ్ళతో పెట్టుకున్న మొరలు నాకు ఎంతో ఇష్టమైనవి. అతని అవసరాలు అతనికి నా వైపునకు మళ్ళించాయి. అతను నన్ను అభ్యర్థిస్తున్నాడు. ఒకవేళ అతని అవసరాన్ని నేను వెంటనే పూర్తి చేస్తే అతని అవసరం పూర్తి కాగానే అతను నా నుంచి వెనుదిరిగి పోతాడు. ఆటపాటలలో, ప్రాపంచిక వ్యవహారాలలో నిమగ్నమైపోతాడు. ఇప్పుడు అతను హృదయాంతరాల్లో నుంచి ఎలుగెత్తి నన్ను పిలుస్తున్నాడు. ఓ అల్లాహ్! ఓ అల్లాహ్! అనే ఆ పిలుపు ధ్వని నాకు ఎంతో ఇష్టమైనది. ఒక విశ్వాసికి ఈ ప్రపంచం ఒక చెరసాల వంటిది. ఒక అవిశ్వాసికి ఈ ప్రపంచం స్వర్గం వంటిది. కనుక అల్లాహ్ మనిషి తన వైపునకే మళ్ళి ఉండాలని దుఆలను అంగీకరించటంలో జాప్యం చేస్తాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఒక విశ్వాసి వివేకం ఏమిటంటే, అనుక్షణం అల్లాహ్ వైపునకే మరలి ఉండాలి. సుఖసంతోషాల సమయాలలోనూ, కష్టనష్టాల సమయాలలోనూ అల్లాహ్‌ను వేడుకుంటూనే ఉండాలి. అల్లాహ్ అత్యంత శక్తి సంపన్నుడు. మనిషి అత్యంత బలహీనుడు.

ఒక విశ్వాసిని కొన్నిసార్లు భయభ్రాంతులకు గురి చెయ్యటం జరుగుతుంది. కాని కొంతకాలం తరువాత అతనికి కలిగిన భయభ్రాంతులే అతనికి శాంతికాముకులుగా మారుతాయి. ఉదాహరణకు, ఫిరౌన్ మంత్రగాళ్ళను సమావేశపరిచాడు దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) గారి దైవ సూచనకు వ్యతిరేకంగా. కాని అది అతనికే వ్యతిరేకంగా అడ్డుగా మారింది. ఇంకా దుర్మార్గుడైన ఆ ఫిరౌన్ ఇస్రాయీల్ సంతతి వారి వెంటపడ్డాడు. అప్పుడు చూసేవారికి బలవంతుడైన, క్రూరుడైన రాజు ఫిరౌన్ చేతిలో బలహీనులైన ఇస్రాయీల్ వంశీయులు చేజిక్కిపోతారేమో, తీవ్ర నష్టానికి, పరాభవం పాలవుతారేమో అన్నట్లుగా ఉండింది ఆ దృశ్యం. కొన్ని ఘడియలలోనే ఇస్రాయీల్ వంశీయులు బంధించబడిపోతారు. తన చేతికి చిక్కిపోతారు అని విర్రవీగుతున్న ఫిరౌన్‌కు ఆ ఘడియలే మృత్యుశకటమయ్యాయి. విజయపు అంచుల వరకు తీసుకునిపోయి ఆ ఘడియలే సముద్రపు అలలలో నిలువునా ముంచేశాయి. ఇస్రాయీల్ వంశీయులకు సుఖశాంతులను కలుగజేశాయి. సంతోష తరంగాలలో ముంచివేశాయి.

ఇదంతా జరగటానికి, ఈ విధంగా సహాయ సహకారాలు లభించటానికి కారణం దైవప్రవక్త మూసా(అ), ఆయన గారి సహచరులు చేసిన దుఆలు. కన్నీళ్ళతో పెట్టుకున్న మొరలు, ఎలుగెత్తి పలికిన వేడుకోళ్ళు. అల్లాహ్ పైనే పెట్టుకున్న నమ్మకాలు. ఈ ఉపమానం మాదిరిగానే ఈనాడు మనం కూడా కేవలం అల్లాహ్‌నే విశ్వసించి, ఆయన్నే వేడుకుంటే తప్పకుండా మన దుఆలు కూడా అంగీకరించబడతాయి. సుఖశాంతులు సొంతమవుతాయి. శత్రువులతో రక్షణలు లభిస్తాయి. అల్లాహ్‌ను నమ్ముకుని, అల్లాహ్‌ను మొర పెట్టుకున్న ఒక విశ్వాసికి తప్పకుండా అల్లాహ్‌యే సరిపోతాడు.

# ఎందుకీ ఓర్వలేనితనం

- ఎం.ఎ. ఆరిఫ్, రుద్రంపూర్, కొత్తగూడెం

**ప్రపంచంలో** ప్రతి ఒక్కరికీ ఉండే ప్రమాదకరమైన మానసిక రోగం ఓర్వలేనితనం... అదే ఈర్ష్య. వేరొకరికి మనకన్నా ఎక్కువ ఉన్నప్పుడు వారికున్నది మనం కోరుకోవడాన్ని ఈర్ష్య అంటారు. ఈర్ష్య అనేది మనిషి మనసుకు విషం వంటిది.

ఈర్ష్యలేనివారు ప్రపంచంలో చాలా అరుదు. మనిషిలో ఏదో ఒక మూల ఎంతో కొంత మోతాదులో నక్కి ఉంటుంది. మనిషిని ఇంతలా విచ్ఛిన్నం చేస్తున్న ఈర్ష్యను తగ్గించడం ఎలా? మనలో సాధ్యపడనిది ఇతరులకు సాధ్యమైనప్పుడు ఎదుటివారి పట్ల ఈర్ష్య కలుగుతుంది.

ఈర్ష్య, అసూయ, ద్వేషం... ఇవన్నీ మనసుకు సంబంధించినవే. ఒకరితో పోల్చుకోవడంతో ఈర్ష్య మొదలవుతుంది.

వేరొకరి దగ్గర మీకన్నా ఎక్కువ ఉందని మీకు అనిపించినప్పుడు మీకు అసూయ కలుగుతుంది. ఈర్ష్య హద్దు మీరితే ప్రమాదమే.

ఈర్ష్యాద్వేషాలకు ఎవరూ అతీతులు కారు. ఆడ, మగ తేడా లేదు. చదువుకున్నవారు, చదువులేనివారనే వివక్ష లేదు. అసూయ ముందు పుట్టి ఆ తర్వాత ఆడవారు పుట్టారంటారు. కాని నిజం కాదు. దీనికి లింగ బేధం లేదు. ఈర్ష్య ఎందుకు కలుగుతుంది? ఈర్ష్య మనసులో ఏర్పడినప్పుడు, మానసిక ప్రవర్తన విపరీత పోకడలు పోతూ ఉంటుంది. ఇది వెంటాడుతున్నప్పుడు కొంత మంది ఎవ్వరికీ ఏమి చెప్పరు. తమలో తామే కుమిలి పోతుంటారు. ఈర్ష్య, అసూయ, ద్వేషం వంటి భావాలు మనలో ఏర్పడుతున్నాయంటే మనలో ఏదో లోపం ఉందని అర్థం.

అసూయకు దూరంగా ఉండండి. అది అగ్ని కట్టెల్ని కాల్చినట్లు అసూయ సత్కర్మల్ని కాల్చివేస్తుంది అని దైవప్రవక్త ముహమ్మద్(స) అన్నారు.

ఈర్ష్య మనిషి పతనానికి నాంది. ఎవరైనా బాగా ఉంటే చాలు ఈర్ష్య బయటకు వచ్చేస్తుంది. అది కుదురుగా కూర్చోనివ్వదు, ఏ పని చేసుకోనివ్వదు. ఇతరుల ధనానికి, విద్యాభివృద్ధికి, తేజస్సుకు, ఓర్వలేక మనసు నొచ్చుకుని అసహ్యించుకునే మానవుడు వ్యాధి లేని బాధను అనుభవిస్తాడని దీని అర్థం.

ఈర్ష్య, అసూయ, ద్వేషం లాంటివి పిల్లలకు అంటకుండా చూసుకోవాలి. పిల్లలు మంచి మనసుతో ఎదుగుతున్నారా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు పట్టించుకోవాలి. అసూయ, ద్వేషం, ఈర్ష్య, ఓర్వలేనితనం ఇవన్నీ మనిషికి దుర్గుణాలు. అవి మనిషి మంచితనాన్ని నిలువునా కూల్చివేసే మారణాయుధాలకు నమూనాలు.

మీరు ఒకరిపై ఒకరు అసూయ, ద్వేషాలు పెంచుకోకండి. ఒకరికొకరు పరోక్ష నిందకు కూడా పాల్పడకండి. మీలో ఉన్న ఈర్ష్యను పక్కనపెట్టి మారడానికి ప్రయత్నించండి. ఒకరిపై ఈర్ష్యపడుతూ ద్వేషం పెంచుకోవడంలో అసలు అర్థం లేదు.

గట్టిగా తుమ్మినా, దగ్గినా ఊడిపోయే ప్రాణాల కోసం ఈర్ష్య ద్వేషాలు ఎందుకు? ఉన్నది ఒక్కటే జీవితం కలకాలం గుర్తుండేలా జీవించు.

హృదయానికి పట్టిన తుప్పు పోవాలంటే మృత్యువును అత్యధికంగా జ్ఞాపకం చేసుకుంటూ ఉండండి అని దైవప్రవక్త ముహమ్మద్(స) అన్నారు. అంతిమంగా ఈర్ష్య, అసూయలు మీ మనస్సుకు మాత్రమే కాకుండా ఇతరుల మనస్సులను కూడా శాంతి లేకుండా చేస్తాయి. సాటివారి పట్ల అసూయ, ద్వేషం పెంచుకోకూడదు. ఈర్ష్య, అసూయ, ద్వేషం ఇలాంటి భావోద్వేగాలు ప్రతి ఒక్కరిలోను ఉంటాయి.


ఇతరులకు బాధలను సృష్టించడం వల్ల నాకు ఉపయోగం ఏమిటి? నా జీవిత గమ్యం, నా పరిస్థితులను చక్కగా అర్థం చేసుకుంటే ఈ అనవసర బాధలను నేడు తొలగించవచ్చు. నేను ఎందుకు ఈర్ష్య, అసూయ కలిగి ఉన్నాను, వీటివల్ల నాకు కలుగుతున్న లాభమేంటి అని ప్రశ్నించుకోవాలి.

మన హృదయం ఈర్ష్య, అసూయలతో నిండి ఉంటే దేవుడు కూడా ఇష్టపడడు. అందరూ సమానమే అని మనసులో పెట్టుకుని మనకున్నదాంట్లో మనం సంతోషంగా ఉండాలని ఎప్పుడూ మనసులో అనుకోవాలి.

# మైనారిటీ అభ్యర్థులకు సివిల్స్ కోచింగ్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2023 కోసం మైనారిటీ విద్యార్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలంగాణ స్టేట్ మైనారిటీ స్టడీ సర్కిల్ వెల్లడించింది. విద్యా సంవత్సరం 2022-23 కోసం కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిమ్ పేర్కొన్నారు. కోచింగ్ కోసం రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతాయని తెలిపారు. సివిల్స్ కోచింగ్ తీసుకునే అభ్యర్థులు స్టడీ సర్కిల్ నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. అందులో మెరిట్ సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి వారికి సివిల్స్ పరీక్షల కోసం కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించి ఉండకూడదు. ఆసక్తి గలవారు ఆగస్టు 22 నుంచి **www.tmreis.telangana.gov.in** లో దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ అర్హత గల ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు అర్హులు. దరఖాస్తు చేసుకోవాల్సిన చివరి తేదీ సెప్టెంబర్ 1. తెలంగాణ మైనారిటీ పాఠశాలల్లో సెప్టెంబర్ 11న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల హెడ్‌క్వార్టర్స్‌లో ఈ పరీక్ష జరుగుతుంది.

# బిల్కిస్ అత్యాచార దోషుల విడుదలను ఖండించిన జే.ఐ.హెచ్



బిల్కిస్ బానో అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న దోషులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్ని జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థ తీవ్రంగా ఖండించింది. “మేము బిల్కిస్ బానూ సామూహిక అత్యాచారం, ఆమె కుటంబంలోని ఏడుగురు సభ్యులను తుదముట్టించి దోషులుగా జీవిత ఖైదు అనుభవిస్తున్నవారిని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నామ”ని ఒక పత్రికా ప్రకటనలో జేఐహెచ్ జాతీయ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ముహమ్మద్ సలీమ్ ఇంజనీర్ వెల్లడించారు. ఒక వర్గం వారిని సంతోషపెట్టడానికి రాజకీయ లబ్ధిపొందేటటువంటి ఇలాంటి నిర్ణయాలు తీవ్ర అభ్యంతరకరం అన్నారు. మేము ఈ నిర్ణయాన్ని, ఈ చర్యను ఖండిస్తున్నాము. సర్వోన్నత న్యాయం స్థానం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. ప్రభుత్వ పాలసీల ముసుగులో ఇలాంటి అన్యాయాలు ఆపడానికి న్యాయస్థానాలే జోక్యం చేసుకోవాలని అన్నారు. క్షమాభిక్ష పెట్టడం అనేది చిన్న చిన్న శిక్షలు అనుభవించే వారి విషయంలో జరగాలి. అత్యాచారానికి, హత్యలకు పాల్పడిన వారికి క్షమాభిక్ష పెట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కేసులో విడుదలయిన వారిని సీబీఐ నేరస్తులుగా పరిగణించింది. ముంబై హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది అని గుర్తుచేశారు. 11 మంది నేరస్థులలో కేవలం ఒక్క వ్యక్తి మాత్రమే క్షమాభిక్ష పెట్టమని సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అతని అప్పీలును పరిశీలించమని గుజరాత్ ప్రభుతాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేసింది. అది అందరికీ క్షమాభిక్ష పెట్టమని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం వెనుకా ముందు ఆలోచించకుండా అందరికీ క్షమాభిక్ష పెట్టి విడుదల చేసింది.




## రోహింగ్యాల పట్ల కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి

రోహింగ్యా శరణార్థుల విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. రోహింగ్యాలకు ఇళ్ళు ఇస్తామని కేంద్ర మంతి హర్దీప్ పురీ వెల్లడించిన కొద్ది గంటల్లోనే హోం శాఖ అలాంటిదేమీ లేదంటూ ప్రకటించడం గమనార్హం. ఆశ్రయం కోరి వచ్చిన శరణార్థులకు భారత్ ఎప్పుడూ స్వాగతిస్తుందని, వారికి త్వరలోనే ఇళ్ళు ఇస్తామని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ పేర్కొన్నారు. ఆయన ప్రకటన చేసిన కొద్ది గంటల్లోనే బీజేపీ ప్రభుత్వం మాటమార్చింది. అలాంటి దేమీ లేదంటూ కేంద్ర హోం శాఖ హడావిడిగా వివరణ ఇచ్చింది. కేంద్ర మంత్రి అలా ఎందుకు ప్రకటించారో, హోం శాఖ మళ్ళీ దాన్ని ఎందుకు వెనక్కు తీసుకుందో అర్థం కావడం లేదని కొందరు అయోమయానికి గురౌతున్నారు.

## ప్రశాంతంగా జీవించే హక్కును తిరిగివ్వండి

అత్యాచార నిందితులకు క్షమాభిక్ష పెట్టి గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడంపై బాధితురాలు బిల్కిస్ బానో స్పందించారు. న్యాయంపై నమ్మకాన్ని కోల్పోయానని అన్నారు. గుజరాత్ ప్రభుత్వ చర్యను ద్రోహంగా పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయం తనను స్తబ్దతకు గురిచేసిందని, పదాలు కూడా రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో 'ఏ స్త్రీకైనా న్యాయం ఇలా ముగుస్తుందా? నేను నా దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలను నమ్మాను, వ్యవస్థను విశ్వసించాను. నేను అనుభవిస్తున్న బాధతోనే జీవితాన్ని నెట్టుకొస్తు న్నాను. నా దుఃఖం, విశ్వాసం కేవలం నా కోసం మాత్రమే కాదు. న్యాయస్థానాల్లో న్యాయం కోసం పోరాడుతున్న ప్రతి మహిళ కోసం' అని వ్యాఖ్యానించారు.

## సీఏఏను ఉపసంహరించుకోవాలి

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఈశాన్య రాష్ట్రాల్లో మేఘాలయ, అస్సాంలో విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టాయి. భద్రతా బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలని, ఇన్నర్ లైన్ పర్మిట్‌ను ఈశాన్య భారతమంతా అమలు చేయాలని డిమాండ్ చేశాయి. 1951 జనాభా లెక్కలను అనుసరించి ఎన్ఆర్‌సీని అప్‌డేట్ చేయాలని కోరాయి. అస్సాం ఒడంబడికను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాయి. ఈశాన్య ప్రాంత సంస్కృతి, వైవిధ్యతకు అనుగణంగా ఎడ్యుకేషన్ పాలసీ తీసుకు రావాలని కోరాయి.

## కులవివక్షకు మరో దళిత విద్యార్థి బలి

స్వాతంత్ర్య మహోత్సవాలు జరుపుకుంటున్న వేళ ఒక దళిత విద్యార్థి కులవివక్షకు బలవడం దేశవ్యాప్తంగా అందరినీ కలచివేసింది. అగ్రకులాలు ఉపయోగించే కుండలో నీళ్ళు తాగిన దళిత బాలుడిపై టీచర్ దాడి చేయడంతో చికిత్స పొందుతూ ఆ బాలుడు మరణించాడు. ఈ సంఘటన రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలో జరిగింది. ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న తొమ్మిదేండ్ల దళిత బాలుడు.. ఉన్నత కులాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కుండ నీటిని తాగాడు. టీచర్ అది చూసి తీవ్రంగా కొట్టడంతో అతని కన్ను, చెవికి గాయాలయ్యాయి. మొదట ఉదయ్‌పూర్‌లో వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గల దవాఖానలో చేర్చారు. కానీ, చికిత్స పొందుతూ గతవారం మరణించాడు. విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడు చైల్ సింగ్‌ను అరెస్ట్ చేసి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్యా నేరం కింద కేసులు నమోదు చేశారు.



## ప్రధానిపై రాహుల్ ఫైర్

ప్రధాని మోడీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. 'మీ మాటలకు, చేతలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రపంచ మొత్తం చూస్తోంది' అంటూ వ్యాఖ్యానించారు. 2002 గుజరాత్ అల్లర్లలో అత్యాచారానికి గురై, కుటుంబాన్ని మొత్తం పొగొట్టుకున్న బిల్కిస్ బానో కేసులో 11 మంది నిందితులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్నినుద్దేశించి రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఐదు నెలల గర్భిణీపై అత్యాచారం చేసి.. ఆమె 3 ఏళ్ల చిన్నారిని అత్యంత పాశవికంగా పొట్టనబెట్టుకున్న వారిని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కింద విడుదల చేశారు. మహిళా సాధికారత గురించి మాటలు చెప్పేవారు.. దీనిద్వారా దేశంలోని మహిళలకు ఏం సందేశం ఇద్దామనుకున్నారు' అంటూ ప్రధాని మోడీ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నారీశక్తి గురించి ప్రసంగించగా.. ఈ సందర్భంగా రాహుల్ ఎత్తి చూపారు.




## చైనాలో కరెంట్ కష్టాలు..

కరెంటు కష్టాలతో చైనా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీంతో దేశ నైరుతి ప్రాంతంలో పలు కర్మాగారాలు మూతపడ్డాయి. వేసవి కాలం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. అయితే, జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రిజర్వాయర్లలో సరిపడా నీళ్లు లేవు. దీంతో చైనాలోని ఓ నగరంలో విద్యుత్ బ్లాక్‌అవుట్ విధించారు. కంపెనీలు రాబోయే ఐదు రోజులు పాటు పవర్ రేషన్ పాటించాలని ఆదేశించడంతో సిచువాన్ ప్రావిన్స్‌లోని సోలార్ ప్యానళ్లు, సిమెంట్, యూరియా తయారు చేసే కంపెనీలతో సహా చాలా కంపెనీలు మూసివేశారు, మరి కొన్ని కంపెనీలు ఉత్పత్తిని తగ్గించాయి.

## ప్రపంచంపై పెత్తనానికి అమెరికా యత్నం

ప్రపంచంపై పెత్తనం చలాయించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లో శత్రుత్వాన్ని మరింత ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల సైనికాధికారుల సమావేశంలో మాట్లాడిన పుతిన్.. రష్యా వ్యతిరేక స్థావరంగా ఉక్రెయిన్‌ను అమెరికా మార్చుతున్నందునే అక్కడికి తమ దళాలను పంపామని ఉద్ఘాటించారు.

## సిరియాపై ఇస్రాయిల్ క్షిపణి దాడులు..

సిరియాపై ఇస్రాయిల్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో సిరియాకు చెందిన ముగ్గురు సైనికులు మృతి చెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. రాజధాని డమస్కస్ గ్రామీణ ప్రాంతం, టార్టాన్ సమీపంలోని తీర ప్రాంతంలోని కొన్నింటిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపిందని సనా న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఈ దాడులపై మాట్లాడేందుకు ఇస్రాయిల్ సైన్యం నిరాకరించింది.

## అవినీతి కేసులో సూకీకి ఆరేళ్ల జైలు..

మయన్మార్ కీలక నేత, నోబెల్ బహుమతి విజేత ఆంగ్‌సాన్ సూకీ (77)కి అక్కడి కోర్టు ఆరేళ్ల జైలు శిక్ష విధించింది. నాలుగు అవినీతి కేసులతో సూకీకి సంబంధం ఉన్నట్టు కోర్టు పేర్కొంది. మయన్మార్‌లో ఆరోగ్యం, విద్యను ప్రోత్సహించడానికి ఆమె నెలకొల్పిన 'డా ఖిన్ క్వీ' ఫౌండేషన్ నిధులను సూకీ దుర్వినియోగం చేశారంటూ కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. మయన్మార్‌లో సైన్యం తిరుగుబాటు చేసి అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తరువాత సూకీని గత ఏడాది ఫిబ్రవరి 1న అరెస్టు చేశారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఆమెను పదవి నుంచి తొలగించారు. అవినీతి కేసులతో పాటు ఎన్నికల నిబంధనల ఉల్లంఘన వరకు మొత్తం 18 నేరాలపై ఆమెను దోషిగా కోర్టు పేర్కొంది. న్యాపిడాలోని జైలులో ఒంటరిగా ఆమె నిర్బంధంలో ఉంటున్నారు. ఇతర కేసుల్లో ఇప్పటికే ఆమెకు 11 ఏళ్లు శిక్ష పడింది. మిగిలిన కేసుల్లోనూ దోషిగా తేలితే దాదాపు 190 ఏళ్ల పాటు ఆమె జైలులో శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

## రష్దీపై దాడిలో మా ప్రమేయం లేదు

ప్రముఖ భారతీయ సంతతి రచయిత సల్మాన్ రష్దీపై న్యూయార్క్‌లో జరిగిన దాడి ఘటనలో తమ ప్రమేయం లేదని ఈరాన్ పేర్కొంది. న్యూయార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రష్దీ (75)పై ఓ యువకుడు కత్తితో దాడి చేయగా.. రష్దీ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒక కన్ను కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొన్నారు. దాడిలో ఆయనకు చాలా గాయాలయ్యాయని రష్దీ సన్నిహితులు తెలిపారు. అయితే, ఘటనలో తమ పాత్ర లేదని ఇరాన్ విదేశాంగశాఖ ప్రకటన విడుదల చేసింది.

## రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలి

రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాలను ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ కోరారు. ఉక్రెయిన్‌లోని న్యూక్లియర్ పవర్ ప్లాంట్ వద్ద కాల్పులు జరిగిన విషయాన్ని హైలైట్ చేసి ఇలాంటి దాడుల వల్ల జరిగే ప్రమాదాలను ఎత్తి చూపారు..“రష్యా చర్యల వల్ల ఏదైనా పెనుప్రమాదం సంభవిస్తే.. ఇప్పుడు నోరు మెదపని వాళ్లు కూడా దాని పర్యవసానాన్ని అనుభవించకపతప్పదు” అని హెచ్చరికలు చేశారు.

## మస్జిదుల్ హరామ్‌లో ఐదేళ్ళ లోపు పిల్లల ప్రవేశానికి అనుమతి

ఐదేళ్ల లోపు పిల్లలు మస్జిదుల్ హరామ్‌లో ప్రవేశించేందుకు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక నుంచి వారు తమ తల్లిదండ్రులతో పాటు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే మస్జిదుల్ హరామ్‌కు వెళ్ళవచ్చు. అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలు మాత్రం ఈతమర్‌నా యాప్ ద్వారా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించింది. పర్యాటక, విజిట్ వీసా ద్వారా వచ్చే వారు కూడా ఉమ్రా చేసుకోవచ్చని తెలిపింది. ఏ వీసా ద్వారానయినా ఉమ్రా చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ప్రయివేటు, ఫ్యామిలీ వీసా ద్వారా వచ్చే వారు కూడా ఈతమర్‌నా యాప్ ద్వారా ఉమ్రా పర్మిట్ తీసుకోవచ్చు. ఉమ్రా చేయాలనుకునేవారు మాత్రం కంప్లీట్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.

# ధర్మసమ్మతమైన సంపద విశ్వాసి పాలిట దైవానుగ్రహం

**దైవప్రవక్త** (సఅసం) తనతో ఈ విధంగా చెప్పారని హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్(రజి) తెలిపారు : "నిన్ను ఒక సైనిక దళానికి అధిపతిగా నియమించి పంపాలని, నీవు దైవకృప వల్ల సురక్షితంగా (విజేతగా) తిరిగి రావాలని, నీకు యుద్ధప్రాప్తి కూడా లభించాలని, దేవుని తరఫున మంచి సంపద కూడా నీకు కానుకగా లభించాలన్నది నా అభిలాష." దానికి నేను, 'ఓ దైవప్రవక్తా(స)! నేను సిరిసంపదలను ఆశించి ఇస్లాం స్వీకరించలేదు. ఇస్లాం పట్ల గల ప్రేమాభిమానంతోనే నేను దానిని స్వీకరించాను. దానికితోడు మీ సహచర్య భాగ్యం నాకు లభించాలని కోరుకున్నాను' అన్నాను. అప్పుడాయన (సఅసం) ఇలా చెప్పారు : "ఓ అమ్ర్! సజ్జనుడైన దైవదాసుని కొరకు ధర్మసమ్మతమైన మంచి సంపద కూడా బహు చక్కనిదే (మహదానుగ్రహమే)." (ముస్నదె అహ్మద్)


**సంగ్రహణం :** హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్(రజి) గారి ఈ హదీసు ద్వారా సుబోధకమయ్యే విషయమేమిటంటే ఏ వ్యక్తికయినా సిరిసంపదలు ప్రాప్తమవుతే దానిని దేవుని మహదానుగ్రహంగా భావించాలి. ఒకవేళ మనిషి లేమికి గురై ఉండి సహనంతో, సంతృప్తితో మెలిగినట్లయితే ఇది కూడా ఓ మహా భాగ్యమే. పేదరికంలో ఉండి కూడా మనిషి సంతృప్త మనసుతో జీవితం గడిపేందుకు అలవాటు పడ్డాడంటే నిశ్చయంగా అతను దైవేచ్ఛతో రాజీపడ్డాడు. ఇది అతని పాలిట ఎంతో శుభదాయకమవుతుంది. దైవప్రవక్త(సఅసం) సయితం తన కొరకు ఇలాంటి పరిస్థితినే ఇష్టపడ్డారు. తనను పేదవానిగానే ఉంచమని దైవాన్ని ప్రార్థించేవారు- ఒకవేళ దాసునికి ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా దేవుడు పుష్కలంగా కలిమిని ప్రసాదిస్తే, తద్వారా మనిషిలో కృతజ్ఞతా భావం జనిస్తే, దైవమార్గంలో సంపదను ఖర్చుపెట్టే సద్బుద్ధి కూడా అతనికి ప్రాప్తిస్తే దానిని దేవుని ప్రత్యేక కటాక్షంగా, గొప్ప అనుగ్రహంగా పరిగణించాలి. దైవ ప్రవక్తలలో హజ్రత్ దావూద్, హజ్రత్ సులైమాన్, హజ్రత్ అయ్యూబ్, హజ్రత్ యూసుఫ్ (అలైహిముస్సలాం) లాంటి వారికి పరమ ప్రభువు అపారంగా అనుగ్రహించాడు. మహాప్రవక్త ప్రియ సహచరులలో హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ (ర.అన్హుమ్) లాంటి అగ్రశ్రేణి సహాబాకు అల్లాహ్ అపారమయిన సిరిసంపదల్ని ప్రసాదించాడు. కాబట్టి ఇది కూడా ముమ్మాటికీ దైవానుగ్రహమే.

### వ్యవసాయం, తోటల పెంపకం ఎంతో పుణ్యప్రదం

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "ఏ విశ్వాసి అయినా సరే మొక్కను నాటితే లేదా సేద్యం చేస్తే తద్వారా పండిన పంట నుండి పక్షులు తిన్నా, మనిషి తిన్నా, పశువులు తిన్నా- అది అతని పాలిట దానం (సదఖా) అవుతుంది." (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

**సంగ్రహణం :** సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ- మొక్కలు నాటే వారికి, సేద్యం చేసేవారికి ఈ హదీసులో వినిపించబడిన శుభవార్త ఎంత గొప్పది! రాకపోకలు సాగించే మనుషులు గానీ, పశువులు గానీ, ఎగిరే పక్షులుగానీ ఆ చెట్ల పండ్లు తిన్నా, క్రింద రాలిన గింజలు తిన్నా, ఆ పొలం యజమాని 'పంట పండినట్లే'. దైవమార్గంలో అతను దానధర్మాలు చేసిన దాతగా లిఖించబడతాడు. కష్టపడే జీవుల ఆత్మ విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని ఈ హదీసు రెట్టిస్తుంది.

**("హదీసు పరిమళం 6 & 7 భాగం" నుంచి)**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**